ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
ఆదివారం 30 జూన్ 2024



గిరి ప్రదక్షిణకు చురుగ్గా ఏర్పాట్లు



సింహాచలం, జూన్ 29: సింహగిరి ప్రదక్షిణకు దేవస్థానం ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి నేతృత్వంలో అధికారులు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చే నెల 20వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు స్వామి వారి పుష్పరథం కొండదిగువన తొలిపావంచా వద్ద నుంచి ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి రెండు రోజుల క్రితం దేవస్థానం అధికారులు గిరి ప్రదక్షిణ మార్గంలో క్షేత్రస్థాయి పరిశీలన కూడా చేశారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని పదిహేను పనులకు ఈ ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు పిలిచారు.



నగరంలోని దసపల్లా హోటల్ వద్ద అయ్యన్నపాత్రుడుకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న వేదపండితులు

అయ్యన్నకు అభినందనల వెల్లువ

- స్పీకర్‌గా తొలిసారి నగరానికి విచ్చేసిన ఆయనకు ఘనంగా స్వాగతం
- నర్సీపట్నంలో పౌర సన్మానం

విశాఖపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత శనివారం తొలిసారి నగరానికి వచ్చిన చింతకాయల అయ్యన్నపాత్రుడుకు అభినందనలు వెల్లువెత్తాయి. ఆయన్ను కలిసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, వ్యాపార ప్రముఖులు, కూటమి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావడంతో దసపల్లా హోటల్ సందడిగా మారిపోయింది. అయ్యన్నను కలిసి అభినందించిన వారిలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, 'దసపల్లా' గ్రూపు అధినేత రాఘవేంద్రరావు, శ్రవణ్ షిప్పింగ్ యజమాని సాంబశివరావు, జీవీఎంసీలో టీడీపీ ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాసరావు, టీడీపీ నేత పట్టాభి, తదితరులు ఉన్నారు. నగరం నుంచి ఆయన అనకాపల్లి వెళ్లి నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్నారు. అక్కడ నుంచి నర్సీపట్నం చేరుకున్నారు. సాయంత్రం నర్సీపట్నం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో స్పీకర్‌కు పౌర సన్మానం జరిగింది.



నర్సీపట్నంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడుకి జ్ఞాపిక అందజేస్తున్న టీడీపీ నేతలు. చిత్రంలో ఎంపీ సీఎం రమేశ్ ఉన్నారు

పెన్షన్ల పంపిణీకి ఏర్పాట్లు



- జీవీఎంసీ పరిధిలో 1,46,930 మందికి రూ.100.91 కోట్లు
- సచివాలయాల వారీగా నగదు డ్రా
- ఒకటో తేదీన ఇంటింటికీ వెళ్లి పెన్షన్ అందజేయనున్న కార్యదర్శులు

విశాఖపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలోని 1,46,930 మంది పెన్షన్‌దారులకు సోమవారం రూ.100.91 కోట్లు పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. కూటమి అధికారంలోకి వస్తే పింఛన్‌ను మూడు వేల నుంచి రూ.నాలుగు వేలకు పెంచుతామని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. ఆ మేరకు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే పెన్షన్ పెంపుపైనే చంద్రబాబు తొలిసంతకం చేశారు.

జూలై ఒకటో తేదీన రూ.నాలుగు వేలతోపాటు ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన ఎరియర్స్ రూ.మూడు వేలు కలిపి రూ.ఏడు వేలు అందజేయనున్నారు. ఈ మేరకు వార్డు సచివాలయ పరిధిలో ఎంత మందికి పెన్షన్ అందజేయాలి, ఎంత మొత్తం అవసరమనే దానిపై అధికారులు ముందుగానే లెక్కలు సిద్ధం చేశారు. ఆదివారం బ్యాంకులు సెలవు కావడంతో శనివారమే పెన్షన్ల పంపిణీకి అవసరమైన డబ్బును బ్యాంకుల నుంచి విత్‌డ్రా చేయాలని సంబంధిత కార్యదర్శులను అధికారులు ఆదేశించారు. వార్డు సచివాలయ కార్యదర్శులు తమకు కేటాయించిన పెన్షన్‌దారుల ఇళ్లకు ఒకటో తేదీ ఉదయాన్నే వెళ్లి పెన్షన్ అందజేయనున్నారు. జోన్-1 (భీమిలి) పరిధిలో 8,722 మందికి రూ.5,97,89,500, జోన్-2 (మధురవాడ) పరిధిలో 20,378 మందికి రూ.13,99,07,500, జోన్-3 (ఆశీల్‌మెట్ట) పరిధిలో 15,389 మందికి రూ.10,61,27,00, జోన్-4 (సూర్యాబాగ్) పరిధిలో 16,014 మందికి రూ.11,03,99,500, జోన్-5 (జ్ఞానాపురం) పరిధిలో 27,424 మందికి రూ.18,84,77,000, జోన్-6 (గాజువాక) పరిధిలో 32,179 మందికి రూ.22,09,25,500, జోన్-7 (అనకాపల్లి) పరిధిలో 10,057 మందికి రూ.6,84,500, జోన్-8 (పెందుర్తి) పరిధిలో 16,767 మందికి రూ.11,51,68,000 అవసరమని ఆయా జోనల్ కమిషనర్లు నివేదికలు సమర్పించారు. అలాగే విశాఖ జిల్లా పరిధిలోని పెందుర్తి మండలంలో 8,113 మందికి రూ.5,24,79,500, పద్మనాభం మండలంలో 8,821 మందికి రూ.5,97,92,000, ఆనందపురం మండలంలో 6,191 మందికి రూ.4,11,93,000, పెందుర్తి మండలంలో 4,241 మందికి రూ.2,78,96,000 పెన్షన్ కింద పంపిణీ చేయనున్నారు.

స్థాయీ సంఘాల్లోకి నూతన ఎమ్మెల్యేలు

వచ్చే సర్వసభ్య సమావేశంలో నియామకం

- జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

విశాఖపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఎన్నికైన ఎమ్మెల్యేలను త్వరలో జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల్లో సభ్యులుగా నియమించనున్నట్టు చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర తెలిపారు. శనివారం జడ్పీ హాలులో ఆమె అధ్యక్షతన స్థాయీ సంఘ సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా సుభద్ర మాట్లాడుతూ వచ్చే సర్వసభ్య సమావేశంలో నియామకాలు పూర్తిచేస్తామన్నారు. అరకులోయ ఎమ్మెల్యేగా ఎన్నికైన హుకుంపేట జడ్పీటీసీ సభ్యుడు ఆర్.మత్స్యలింగంను ఈ సందర్భంగా అభినందించారు. అనంతరం వైద్య, ఆరోగ్య శాఖపై జరిగిన చర్చలో విశాఖ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రబలే అంటువ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరికీ బీసీజీ టీకాలు వేస్తున్నామని, అయితే 60 ఏళ్లు దాటిన వారికి, దీర్ఘకాల వ్యాధుల బారినపడిన వారికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఎస్.రాయవరం జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి మాట్లాడుతూ ఏడాది క్రితం వైఎస్సార్ బడుగు వికాస్ కింద వాహనం కొనుగోలు చేసి సబ్సిడీకి జిల్లా పరిశ్రమల కేంద్రానికి దరఖాస్తు చేస్తే ఇప్పటివరకూ మంజూరు చేయలేదని, కొర్రీలు వేస్తున్నారని ఆరోపించారు. జడ్పీటీసీ సభ్యురాలిగా తన పరిస్థితే ఇలా ఉంటే సామాన్య ప్రజలను అసలు పట్టించుకుంటారా?...అని ఆవేదన వ్యక్తంచేయగా సీఈవో పోలినాయుడు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని ... మిగతా 6వ పేజీలో



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

నిబంధనలకు పాతర, అక్రమాల జాతర



ఏయూలో వీసీ ప్రసాదరెడ్డి ఇష్టారాజ్యం

తనకు కావాల్సిన వారికి పోస్టింగ్‌లు... భారీగా వేతనాలు

- ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ పేరుతో పలువురికి అవకాశం
- డిపార్టుమెంట్లలో కిందిస్థాయిలో కూడా ఎడాపెడా నియామకాలు
- కనీసం రూ.20 వేల నుంచి రూ.40 వేల వరకు జీతాలు
- పోలీస్ శాఖలో రిటైరైన ఖాన్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా నియామకం
- ఆయనకు అలవెన్సులతో కలిపి రూ.95 వేల వరకు చెల్లింపు
- అప్పటికే 100 మంది సెక్యూరిటీ సిబ్బంది ఉండగా... మరో 50 మందిని తీసుకున్న ఖాన్
- ఒక్కొక్కరికి రూ.20 వేలు చెల్లింపు
- భారీగా నిధులు దుర్వినియోగం

విశాఖపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ ప్రసాదరెడ్డి అరాచకాలు ఒక్కొక్కటి బయటకు వస్తున్నాయి. ఆయన వీసీగా ఉన్నప్పుడు మాట్లాడేందుకు భయపడిన ఎంతోమంది ఇప్పుడు బయటకు వస్తున్నారు. వర్సిటీ నిధులను ఆయన ఏ విధంగా దుర్వినియోగం చేసిందీ వివరిస్తున్నారు.



ఏయూలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు. చిత్రంలో శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్ ఉన్నారు

వర్సిటీలో చైర్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్... వంటి పేర్లతో కావాల్సిన వారికి కీలక విభాగాల్లో పోస్టింగ్స్ ఇచ్చిన వీసీ..వారికి భారీ మొత్తాలను చెల్లించినట్టు చెబుతున్నారు. అలాగే, గతంలో ఎన్నడూ లేని విధంగా కొన్ని కేడర్లు సృష్టించి మరీ ఉద్యోగాలు కల్పించి లక్షలాది రూపాయలు జీతాలుగా చెల్లించారు. రిటైరైన కృష్ణమోహన్‌ను ఓఎస్‌డీగా నియమించారు. ఇంకా ఇంజనీరింగ్ కాలేజీకి కూడా ఓఎస్‌డీని వేశారు. అదేవిధంగా దూరవిద్యా కేంద్రానికి డైరెక్టర్‌గా ప్రైవేటు యూనివర్సిటీకి చెందిన వ్యక్తిని, ప్లేస్‌మెంట్ ఆఫీసర్లుగా పలు కాలేజీలకు సంబంధించిన ముగ్గురిని నియమించారు. వీరికి భారీ మొత్తంలో యూనివర్సిటీ నిధుల నుంచి వేతనాలను చెల్లిస్తున్నారు. వీరితోపాటు కొన్ని విభాగాల్లో కిందిస్థాయిలో కొందరికి ఉద్యోగాలను వీసీ కల్పించినట్టు చెబుతున్నారు. అలాగే, గతంలో ఎన్నడూ లేనివిధంగా పోలీస్ శాఖలో రిటైరైన ఖాన్‌ను తీసుకువచ్చి వర్సిటీ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా నియమించారు. ఆయనకు నెలకు రూ.75 వేలు వేతనంతో పాటు మరో రూ.20 వేలు వరకు అలవెన్స్ ఇస్తున్నారు. మొత్తం రూ.95 వేలు వర్సిటీ నిధుల నుంచి చెల్లిస్తున్నారు. యూనివర్సిటీలో అప్పటికే సుమారు 100 మంది వరకు సెక్యూరిటీ సిబ్బంది పనిచేస్తుండగా, ఖాన్ తనకు కావాల్సిన మరో 50 మందిని సెక్యూరిటీ సిబ్బందిగా తీసుకున్నారు. వీరంతా ప్రసాదరెడ్డి సేవలోనే తరించేవారు. ఏయూలో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేసే సెక్యూరిటీ సిబ్బందికి రూ.10 వేలకు మించి వేతనాలు చెల్లించడం లేదు. ఖాన్ తీసుకువచ్చిన ... మిగతా 6వ పేజీలో

ప్రక్షాళన చేయాల్సిందే!!

- రాజీనామా చేసినా వెబ్‌సైట్‌లో ఇంకా ఆయన పేరే
- 20 మందికి పైగా చైర్ ప్రొఫెసర్లు
- సీనియారిటీని పక్కనపెట్టి పలువురికి కీలక బాధ్యతలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాల్సి ఉంది. ఉప కులపతి పదవి నుంచి ప్రసాదరెడ్డి తప్పుకున్నా ఆయన అడ్డగోలుగా నియమించిన అనేక మంది అక్కడ పాతుకుపోయారు. క్యాంపస్‌లో ఏమి జరిగినా క్షణాల్లో సమాచారం అందేలా ప్రసాదరెడ్డి ఏర్పాట్లు చేసుకున్నారు. ఏయూ వెబ్‌సైట్‌లో ఇంకా వీసీగా ఆయన పేరు, ఫొటో ఉన్నాయి. దీనిని పలువురు ప్రొఫెసర్లు ప్రశ్నిస్తే...తమకు పై నుంచి ఆదేశాలు రాలేదని, వచ్చేంతవరకూ అలాగే ఉంచుతామని వెబ్‌సైట్ నిర్వహించే బృందం చెప్పడం గమనార్హం. ఆయన సిబ్బందిని ఎలా తయారుచేసుకున్నారో చెప్పడానికి ఇదే పెద్ద ఉదాహరణ. ప్రసాదరెడ్డి రాజీనామా తరువాత అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, ముగ్గురు ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్‌లు శనివారం క్యాంపస్‌కు వెళ్లారు. ఇంత జరిగినా వెబ్‌సైట్ నుంచి ఆయన పేరు తొలగించడానికి అక్కడి సిబ్బంది అంగీకరించలేదు. ఆయన రాజీనామాకు గవర్నర్ ఆమోదం లభిస్తే అప్పుడు తొలగిస్తానని చెప్పడం గమనార్హం.

బయట వారికి పెద్దపీట

ప్రసాదరెడ్డి హయాంలో అనేక విభాగాల్లో చైర్ ప్రొఫెసర్లను నియమించారు. వీరంతా యూనివర్సిటీకి సంబంధం లేనివారు కావడం గమనార్హం. ఒక ప్రైవేటు కళాశాలలో పనిచేసుకునే స్టీఫెన్‌ను తీసుకువచ్చి అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్‌ను చేశారు. ఆ తరువాత రిజిస్ట్రార్ కుర్చీలో కూర్చోబెట్టారు. తాజాగా ఆయన రిజిస్ట్రార్ పదవికి రాజీనామా చేసినా అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్‌గా కొనసాగుతుండడం గమనార్హం. అలాగే నగరంలో ఓ విద్యా సంస్థలో పనిచేసి రిటైరైన (70 ఏళ్లు) వ్యక్తిని తీసుకువచ్చి మరో విభాగంలో చైర్ ప్రొఫెసర్‌ను చేశారు. నగరంలో ప్రముఖుల నుంచి నిధులు సేకరించి, వారికి భారీగా జీతాలు ఇస్తున్నారు. సాధారణంగా ఇలాంటి ప్రాజెక్టులు ఏమైనా ఉంటే యూనివర్సిటీ టీచింగ్ స్టాఫ్‌కే అప్పగిస్తారు. కానీ ప్రసాదరెడ్డి తన వర్గాన్ని పెంచుకోవడానికి బయట నుంచి వీరిని తెచ్చి పెట్టుకున్నారు. ఒక్క క్లాస్ చెప్పి వెళ్లిపోయే వారికి ఆయా విభాగాల్లో ప్రత్యేకంగా ఛాంబర్లు కేటాయించారు. అలాగే రెగ్యులర్ ప్రొఫెసర్లు సంతకాలు చేసే రిజిస్టర్‌లోనే వారితో సంతకాలు చేయించి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. సోమవారం (జూలై 1)నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ... మిగతా 6వ పేజీలో



అన్న క్యాంటీన్‌ను శుభ్రం చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సిద్ధమవుతున్న అన్న క్యాంటీన్లు

- భవనాల మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పనపై జీవీఎంసీ దృష్టి
- రూ.3.3 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లకు ఆహ్వానం
- వచ్చే నెల 20వ తేదీకి జిల్లా యంత్రాంగానికి అప్పగించాలని లక్ష్యం

విశాఖపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో అన్న క్యాంటీన్లను జీవీఎంసీ అధికారులు సిద్ధం చేస్తున్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు స్వీకరించిన రోజే అన్న క్యాంటీన్ల పునఃప్రారంభానికి సంబంధించిన ఫైల్‌పై సంతకం చేశారు. సెప్టెంబరు నాటికి అన్న క్యాంటీన్లను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో జీవీఎంసీ అధికారులు అందుకు అనుగుణంగా పనులు చేపడుతున్నారు. అన్న క్యాంటీన్ల భవనాల మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పనకు రూ.3.3 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు పిలిచారు. వచ్చే నెల 20 నాటికి భవనాలను సిద్ధం చేసి జిల్లా యంత్రాంగానికి అప్పగించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

పట్టణ ప్రాంతాల్లో నిరుపేదలు, వివిధ పనులపై పల్లెల నుంచి వచ్చేవారికి నామమాత్రపు ధరకు నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లకు శ్రీకారం చుట్టింది. జీవీఎంసీ పరిధిలో ఎంవీపీ రైతుబజార్, జగదాంబ జంక్షన్ సమీపంలోని టర్నర్ చౌల్ట్రీ, విమ్స్, ప్రాంతీయ కంటి ఆస్పత్రి, టీబీ ఆస్పత్రి, హోల్‌సేల్ ఫ్రూట్‌మార్కెట్, మద్రిపాలెం, శ్రీహరిపురం, ములగాడ పంప్‌హౌస్, నమ్మిదొడ్డి, చినగంట్యాడ, చిట్టివలస, అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి, రైల్వేస్టేషన్, బాజీ జంక్షన్, పెందుర్తి, వేపగుంట, గోపాలపట్నం రైతుబజార్, కేజీహెచ్ ఓపీ గేట్, ఆరిలోవ, మారికవలస, వాంబే కాలనీ... తదితర 25చోట్ల వీటిని ఏర్పాటుచేసింది. అన్నింటికీ పక్కా భవనాలు నిర్మించింది. క్యాంటీన్‌కు ఎంత మంది వస్తున్నారు, ... మిగతా 6వ పేజీలో

స్టీల్‌ప్లాంట్‌పై ఎన్నాళ్లీ ఆర్థిక భారం?

'విశాఖ విమల విద్యాలయం' నిర్వహణకు సొంత నిధులు సమకూర్చులేకపోతున్న 'డయసిస్' సంస్థ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



విశాఖ విమల విద్యాలయం

- ఏటా రూ.7 కోట్లు కేటాయిస్తున్న ఉక్కు కర్మాగారం
- ఆర్థిక పరిస్థితులు సహకరించపోవడంతో భవిష్యత్తులో తాము సాయం చేయలేమని, వనరులు పెంచుకోవాలని పదేళ్లుగా చెబుతున్న వైనం
- ...అయినా పట్టించుకోని సదరు సంస్థ

స్టీల్ ప్లాంటు నిర్వాసిత గ్రామాల ప్రజల కోసం నిర్వహిస్తున్న విశాఖ విమల విద్యాలయం సొంత నిధులు సమకూర్చుకోలేకపోతోంది. దశాబ్దాలు గడుస్తున్నా జీతాల కోసం ప్లాంటు యాజమాన్యంపైనే ఆధారపడుతోంది. ఇది తగదని, స్వయం సమృద్ధి సాధించాలని పదేళ్ల నుంచి కర్మాగారం యాజమాన్యం చెబుతున్నా పట్టించుకోవడం లేదు.

విశాఖ విమల విద్యాలయాన్ని 1984 నుంచి నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. భవనాలన్నీ స్టీల్‌ప్లాంటు నిర్మించింది. ఫర్నీచర్ సమకూర్చింది. నిర్వహణ ఖర్చులు ఇస్తోంది. నెలనెలా జీతాలు కూడా భరిస్తోంది. మొదట్లో తెలుగు మీడియం మాత్రమే ఉండేది. ఆ తరువాత ఇంగ్లీష్ మీడియం ప్రారంభించారు. ఇకపై తాము ఆర్థిక సాయం చేయలేమని, సొంతంగా నిధులు సమకూర్చుకోవాలని గత పదేళ్ల నుంచి స్టీల్ ప్లాంటు యాజమాన్యం చెబుతోంది. కానీ నిర్వహణ బాధ్యతలు చూస్తున్న క్రిస్టియన్ సంస్థ 'డయసిస్' దీనిని పట్టించుకోవడం లేదు. విద్యార్థుల నుంచి నామమాత్రపు ఫీజులు వసూలు చేస్తున్నామని, వాటితో విద్యాలయాన్ని నిర్వహించలేమని చెబుతూ వస్తోంది. ఇక్కడ మొత్తం ... మిగతా 6వ పేజీలో

కూరగాయల మార్కెట్ సమస్యలు పరిష్కారిస్తా

» దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్


వంశీకృష్ణను గజమాలతో సత్కరిస్తున్న మార్కెట్ కమిటీ సభ్యులు

జ్ఞానాపురం, జూన్ 29: జ్ఞానాపురంలోని వైష్ణవి వెజిటేబుల్ హోల్ సేల్ మార్కెట్‌లో సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధించిన సందర్భంగా ఎమ్మెల్యేను మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ మేరకు ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ హోల్‌సేల్ మార్కెట్‌లో సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని కోరారు. నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని పేర్కొన్నారు. ఎన్నికల ముందు హోల్‌సేల్ మార్కెట్‌లో తనకు ఘన స్వాగతం పలికి, మద్దతు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. అనంతరం కూడలిలోని సౌభాగ్య గణపతి ఆలయం వద్ద జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హోల్‌సేల్ మార్కెట్ అధ్యక్షుడు వీర్రాజు, సెక్రటరీ పరమేశ్వరరావు, సత్యనారాయణ, ప్రసాద్, రాంబాబు, ఐతి మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్ అయ్యన్నపాత్రుడికి అభినందనలు


స్పీకర్ అయ్యన్నకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సత్యనారాయణ

జగదాంబ కూడలి, జూన్ 29: ఏపీ అసెంబ్లీ స్పీకర్‌గా నియమితులై విశాఖ విచ్చేసిన అయ్యన్న పాత్రుడ్ని దక్షిణ నియోజవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ, 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ స్పీకర్‌ను శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీతమ్మధార: శాసనసభా స్పీకర్ ఎన్నికైన చింతకాయల అయ్యనపాత్రుడును డిప్యూటీ మాజీ మేయర్, టీడీపీ నాయకుడు దాడి సత్యనారాయణ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ స్పీకర్‌గా ఎన్నికైన అయ్యన్నపాత్రుడు బీసీ నాయకుడు, ఉత్తరాంధ్ర జిల్లా వాసి కావడం అందరికీ గర్వకారణమన్నారు. రాష్ట్రంలో వెనుకబడి ఉన్న ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి అయ్యన్నపాత్రుడు కృషి చేయాలని కోరారు. పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాలికల ఐటీఐల్లో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కంచరపాలెం, జూన్ 29 : కంచరపాలెం ప్రభుత్వ బాలికల ఐటీఐలో సీట్ల భర్తీకి అభ్యర్థులనుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జీవీ రమణారావు పేర్కొన్నారు. ఐటీఐ రెండో విడత కౌన్సెలింగ్ ప్రారంభంకానున్న నేపథ్యంలో బాలికల సీట్ల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆయన సూచించారు. 2024-2025 విద్యాసంవత్సరానికి గాను డ్రస్ మేకింగ్, కోపా ట్రేడుల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. పదో తరగతి పాసైన బాలికలు తమ దరఖాస్తులను ఐటీఐ వెబ్‌సైట్ ద్వారా సమర్పించడానికి జూలై 24వ తేదీ వరకు గడువు ఉందన్నారు.జూలై 27, 28 తేదీల్లో మెరిట్ అభ్యర్థులకు బాలికల ఐటీఐ ప్రాంగణంలో కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. దరఖాస్తుదారులు తమ అన్నీ ఒరిజినల్ సర్టిఫికెట్లతో సమీపంలో గల ప్రభుత్వ ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకుని తగిన రసీదును పొందాలన్నారు.

ఐటీ రంగాభివృద్ధికి మొదటి ప్రాధాన్యం

» ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, లోకం నాగ మాధవి

» ఘనంగా ఐటీఏపీ వార్షికోత్సవం



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సిరిపురం, జూన్ 29 : వైసీపీ పాలనలో చితికిలపడిన ఐటీ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం సరైన నిర్ణయాలు, ప్రణాళికలతో ముందుకు వెళ్తుందని ఉత్తర, నెల్లిమర్ల ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, లోకం నాగ మాధవి స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం సిరిపురం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఐటీఏపీ) విశాఖపట్నం వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖలో 30 వేల మంది ఐటీ ఉద్యోగులు ఉన్నారని, వారు ఏ సమస్య వచ్చినా... తమను సంప్రతించవచ్చునని చెప్పారు. సమాజాభివృద్ధిలో ఐటీ ఉద్యోగుల పాత్ర గొప్పగా ఉండాలన్నారు. ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ విశాఖలో ఐటీ రంగాన్ని మరింతగా అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. ఐటీఏపీ ప్రెసిడెంట్ లక్ష్మీ ముక్కవల్లి మాట్లాడుతూ 2016లో ఐటీఏపీని ప్రారంభించామన్నారు.కొన్నేళ్ల తరువాత వార్షిక వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ఐటీఏపీ వైస్ ప్రెసిడెంట్ కిషోర్ దాసరి మాట్లాడుతూ ఐటీ రంగం మరింత పురోభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కాగా ఐటీ ఉద్యోగులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలుదుమ్ములేపాయి. ఉద్యోగులు చేసిన పలు డ్యాన్స్‌లు హోరెత్తించాయి. సంబంధిత విభాగాల హెచ్‌ఓడీలు సైతం వారిని ప్రోత్సహిస్తూ డ్యాన్స్‌లు వేయడంతో ఆడిటోరియమంతాసందడి వాతావరణాన్ని తలపించింది. ఈ కార్యక్రమంలో ఐటీఏపీ మాజీ ప్రెసిడెంట్ కొసరాజు శ్రీధర్, ఐటీఏపీ సభ్యులు, వివిధ స్టార్టప్ కంపెనీల సీఈఓలు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి తులసీ దళార్చన

జగదాంబ కూడలి, జూన్ 29: వన్‌టౌన్ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శనివారం సహస్ర తులసీ దళార్చన సేవలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 8గంటల సమయంలో అమ్మవారిని తులసీ దళాలతో అలంకరించి అర్చకులు ఉభయదాతలతో పూజలు జరిపించారు. ఈ పూజల్లో ఈవో శ్రీనివాసుల రెడ్డి, ఏఈవో వి.రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు,అనంతరం భక్తులకు ఆలయ ప్రవేశం కల్పించారు.

ఆనందపురం తహసీల్దార్‌కు షోకాజ్ నోటీసు

» ఆంధ్రజ్యోతి ఎఫెక్టు

విశాఖపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆనంద పురం మండలం రామవరంలో సర్వేనంబర్ 164-3లో ప్రభుత్వం వెనక్కి తీసుకున్న డీపట్టా భూమికి ఫ్రీహోల్డ్ చేసిన తహసీల్దార్ హేమంత్‌కుమార్‌కు జిల్లా కలెక్టర్ షోకాజ్ నోటీసు జారీ చేశారు. రామవరంలో పలు సర్వే నంబర్లలో ఉన్న డీపట్టా భూములకు సంబంధిత రైతులకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు జారీ చేశారు. ఈ క్రమంలో అక్కిరెడ్డి బంగారయ్య అనే రైతుకు సర్వే నంబర్ 164-3లో 1.53 ఎకరాలకు ప్రభుత్వం గతంలో డీపట్టా ఇచ్చింది. అయితే ఈ భూమిని మరో వ్యక్తికి లీజుకు ఇచ్చేయడంతో గ్రామస్తుల ఫిర్యాదుతో మూడేళ్ల క్రితం డీపట్టాను అప్పటి తహసీల్దారు రద్దు చేసి పేదల ఇళ్ల స్థలాలకు కేటాయించడం జరిగిపోయింది. ఈ విషయాన్ని పక్కన పెట్టిన మండల తహసీల్దార్, వీఆర్వో, ఇతర అధికారులు సర్వేనంబరు 164-3లో 1.53 ఎకరాలను ఫ్రీహోల్డ్ చేస్తూ ఆదేశాలు జారీ చేయడాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. దీనిపై బదిలీపై వెళ్లిన కలెక్టర్ మల్లికార్జున ఆదేశాలతో భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి విచారణ చేపట్టారు. ఫ్రీహోల్డు చేసిన సర్టిఫికెట్‌ను రద్దు చేసి ఆనందపురం తహసీల్దార్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. అలాగే గ్రామ రెవెన్యూ అధికారిపై చర్యలకు సిఫారసు చేశారు.

నేడు రవాణా, క్రీడల మంత్రి రాక

విశాఖపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి ఎం.రాంప్రసాదరెడ్డి ఆదివారం నగరానికి రానున్నారు.మధ్యాహ్నం 1.40 గంటలకు ఆయన ఎయిర్‌పోర్టుకు చేరుకుని రాడిసన్ బ్లూ హోటల్‌కు చేరుకుంటారు. అక్కడ సాయంత్రం ఐదు గంటలకు ఆంధ్రా ప్రీమియర్ లీగ్‌ను ప్రారంభించి, రాత్రికి అక్కడే బసచేస్తారు. జూలైఒకటిన రాడిసిన్ బ్లూ హోటల్ నుంచి శ్రీకాకుళం జిల్లా పర్యటనకు బయలుదేరి వెళ్లి తిరిగి మధ్యాహ్నం ఒంటిగంటకు ద్వారకా బస్‌స్టేషన్‌కు చేరుకుని అక్కడ తనిఖీలు నిర్వహిస్తారు. ప్రజా రవాణాశాఖ అధికారులు, ఉద్యోగులతో సమావేశమై సాయంత్రం ఐదున్నరకు ఎయిర్‌పోర్టుకు చేరుకుని విజయవాడ వెళతారు.

పింఛన్ల పంపిణీ ఏర్పాట్లు పరిశీలన


సచివాలయ సిబ్బందితో చర్చిస్తున్న కూటమి నాయకులు

కంచరపాలెం, జూన్ 29 : సచివాలయాల ద్వారా జూలై ఒకటో తేదీ నుంచి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపట్టిన నేపథ్యంలో జీవీఎంసీ 54వ వార్డులో కూటమి నాయకులు శనివారం ఈ ఏర్పాట్లను పర్యవేక్షించారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు కుట్టా కార్తీక్,బీజేపీ అధ్యక్షుడు రంగుముద్ర రాంబాబు, ఇతర కమిటీ ప్రతినిధులు రెడ్డికంచరపాలెం, రైతుబజారు, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, మర్రిపాలెం తదితర ప్రాంతాల్లోని సచివాలయాలను సందర్శించి సిబ్బందితో మాట్లాడి ఏర్పాట్లు పరిశీలించారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్ల పంపిణీలో తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉప్పాడ శేఖర్, కొలుసు సత్యారావు, కాళ్ల అదిబాబు తదితరులు పాల్గొన్నారు.

సీహార్స్ జంక్షన్ వద్ద కాలువలో పూడికలతీత


పూడికతీత పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ భాస్కరరావు, అధికారులు

పూర్ణామార్కెట్, జూన్ 29: వన్‌టౌన్ సీహార్స్ ఎస్‌ఎల్ కెనాల్‌లో పేరుకుపోయిన పూడికలను శనివారం వార్డు కార్పొరేట్ విల్లూరి భాస్కరరావు పర్యవేక్షణలో జీవీఎంసీ సిబ్బంది తొలగించారు. కెనాల్ ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోవడంతో మురుగునీరు రోడ్డుపైకి వచ్చేస్తోంది. దీంతో జీవీఎంసీ సిబ్బందితో కార్పొరేటర్ పూడిక తీత పనులతో చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలను కాలువల్లో వేయవద్దని సూచించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

7న లతారాజా ఫౌండేషన్ స్కాలర్‌షిప్ పరీక్ష

డాబాగార్డెన్స్, జూన్ 29: హైదరాబాద్‌కు చెందిన లతారాజా ఫౌండేషన్ ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేసి స్కాలర్‌షిప్స్ అందించేందుకు జూలై 7న పరీక్షను నిర్వహిస్తున్నట్టు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కేకే రాజా తెలిపారు. శనివారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖలోని ఎండాడ వద్ద ఉన్న ఎయిమ్స్ కాలేజీలో ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, హ్యూమన్‌రిసోర్స్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ , ఆపరేషన్స్, రిటైల్, ఫారిన్ ట్రేడ్ మేనేజ్‌మెంట్ (పీజీడీఎం)లో ఐదుగురు విద్యార్థులకు 100 శాతం ఆర్థిక సహాయంతో విద్య నందిస్తామన్నారు. యాక్స్ కాలేజీ డిగ్రీలో బీటీఏ, బీకాం, బీఎస్సీ, వంటి కోర్సులకు ఇద్దరు చొప్పున 14 మంది కి 100శాతం ఈ స్కాలర్‌షిప్ మంజూరుకు పరీక్షను నిర్వహిస్తున్నామన్నారు.ట్రస్టీ డా.సిద్దోజీరావు తల్లిదండ్రులు లేని విద్యార్థులకు ప్రాధాన్యమిస్తామన్నారు. ముందుగా ఫోన్లు: 9866870179, 81426 57359లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

దంతెవాడ, కామ్లూరు సెక్షన్‌లో సీఆర్ఎస్ పర్యటన


ట్రాక్ పరిశీలిస్తున్న సీఆర్ఎస్‌తో డీఆర్ఎం, ఇతర అధికారులు

విశాఖపట్నం, జూన్ 29: వాల్తేరు డివిజన్ పరిధిలోని దంతెవాడ, కమ్లూరు సెక్షన్‌లో రైల్వే సేఫ్టీ కమిషనర్ (ఈస్టర్న్ సర్కిల్) సువోమా మిత్రా శనివారం పర్యటించారు. ఈ సెక్షన్‌లో చేపట్టిన డబ్లింగ్ లైను నిర్మాణానికి సంబంధించి భద్రతాపరమైన సమర్థతపై సమగ్ర తనిఖీలు చేశారు. మోటారు ట్రాలీపై దంతెవాడ, కమ్లూరు స్టేషన్ల మధ్య సిగ్నలింగ్ సిస్టమ్ పనితీరును పరిశీలించారు. అనంతరం కొత్తగా నిర్మించిన కొత్త రైల్వే లైనులో ట్రయల్ రన్ నిర్వహించి కార్యచరణ నిర్వహణకు అనుమతినిచ్చారు. ఈ పర్యటనలో భాగంగా దంతెవాడ సమీపంలోని డంకిని నదిపై నిర్మించిన కొత్త వంతెనను పరిశీలించారు. అలాగే, దంతెవాడ, కిరండోల్ మధ్య జరిగిన డబ్లింగ్ ప్రాజెక్టు పనుల పురోగతిపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎస్‌శ్రీనివాస్, ఏడీఆర్ఎం సుధీర్‌కుమార్ గుప్తా, చీఫ్ ఇంజనీర్ డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'ఏయూ వీసీకి తగిన గుణపాఠం'

అక్కయ్యపాలెం, జూన్ 29: ప్రజాస్వామ్య విలువలను తుంగలోకి తొక్కిన ఏయూ వీసీ ప్రసాదరెడ్డి తగిన గుణపాఠం జరిగిందని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ అన్నారు. ఏయూ వీసీ ప్రసాదరెడ్డి అరాచకాలపై, నిరుద్యోగ సమస్యలపై ఉద్యమం చేసిన హేమంతకుమార్‌ను ఏయూ ఐక్య ఫ్రంట్ అధ్యక్షుడు ఎం.శాంతిభూషణ్ అభినందించారు. ఈ సందర్భంగా హేమంతకుమార్ మాట్లాడుతూ, ప్రస్తుత కూటమి ప్రభుత్వాన్ని ఎదుర్కోలేక ప్రసాదరెడ్డి వీసీ పదవికి ఆయన రాజీనామా చేశారన్నారు. ఆయన రాజీనామాతో బోధన, బోధనేతర సిబ్బంది ఏయూలో సంబరాలు జరుపుకొన్నారన్నారు. ఉద్యోగాలను భర్తీ చేయకుండా ఐదేళ్లపాటు కాలయాపన చేసి, ఎన్నో విలువైన కోర్సులను ఎత్తేసి విద్యార్థులకు ఆయన విద్యకు దూరం చేశారన్నారు.

నక్కవానిపాలెం గ్రామ కమిటీ ఎన్నికలు నేడు

సీతమ్మధార, జూన్ 29: గ్రేటర్ 24వ వార్డులో గల నక్కవానిపాలెంలో గ్రామ కమిటీ ఎన్నికలు నిర్వహిస్తున్నట్టు గ్రామ పెద్దలు తెలిపారు. ఆదివారం ఉదయం గ్రామంలో ఉన్న యువత, పెద్దలు పోటీలో పాల్గొనవారిని ఎన్నుకుంటారన్నారు. ఉదయం 7 గంటల సాయంత్రం 5 గంటల వరకు ఓటింగ్ జరుగుతుందని చెప్పారు.

ఉద్యోగ విరమణ పోలీసు సిబ్బందికి సన్మానం

మహరాణిపేట,, జూన్ 29: పోలీసు కమిషనరేట్ పరిధిలో ఉద్యోగ విరమణ చేసిన 17 మంది పోలీసు సిబ్బందిని శనివారం కమిషనర్ రవిశంకర్ సన్మానించారు. పదవీ విరమణ చేసిన ఏడీసీపీ ఎస్. వెంకటరావు, ఎస్ఐలు కాళిదాస్, జి. వెంకటరావు, ఆర్ఎస్ఐ ఎన్. బాలరామారావు, ఏఎస్ఐలు జి రాజేశ్వరరావు, ఎం సత్యారావు, వి. నాగపాపారావు, కె. సుబ్బారావు, బి. ప్రకాశరావు, ఆర్.ఆర్.కె. శర్మ, ఎం కమలాకర్‌రావు, ఏఆర్ఎస్ఐలు పి. కనకరాజు, బి. వెంకటేశ్వరరావు, హెచ్‌సీ ఎస్. బ్రహ్మాజీరావు, ఉమెన్ హెచ్‌సీ పి. గంగమ్మ, ఏఆర్ హెచ్‌సీలు ఎం. బలరామ్, పీఎస్ సూర్యనారాయణలను సన్మానించారు. పోలీసు కమిషనరేట్‌కు వారి కుటుంబ సభ్యులను ఆహ్వానించి అధికారులు సమక్షంలో సత్కరించి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు వృద్ధిలోకి రావాలి

» ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు


పుస్తకాలు అందిస్తున్న ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్

మురళీనగర్, జూన్ 29 ; ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను చిన్నారులు సద్వినియోగం చేసుకుని వృద్ధిలోకి రావాలని విశాఖ నార్త్ నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ అన్నారు. గ్రేటర్ 50వవార్డులోని మాధవధార జీవీఎంసీ హైస్కూలులో శనివారం విద్యార్థులకు కిట్స్ అందజేసారు. హెచ్ఎం బి.హేమలత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై స్కూలు యూనిఫారం, టెక్స్ బుక్స్, షూస్, బాగ్ ఇతరత్రా సామగ్రి కలిగిన కిట్‌లను బాలలకు అందించారు. కార్యక్రమంలో ఎంఈవో సోమేష్, వార్డు టీడీపీ అధ్యక్షులు సనపల.వరప్రసాద్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే చిన్నారులకు భవిత


బడికి పోతా.. అవగాహన ర్యాలీలో అధికారులు

సీతమ్మధార, జూన్ 29: గ్రేటర్ 25వ వార్డు మధురానగర్ జీవీఎంసీ పాఠశాల పరిసర ప్రాంతాల్లో నేను బడికి పోతా.. పేరిట అవగాహన ర్యాలీని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మధురానగర్, శాంతిపురం, సీతంపేట, రాజేంద్రనగర్ పరిసర ప్రాంతాల్లో ఏఎస్‌వో గీత, ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ బి.శ్రీనివాస్, ఏపీవో అప్పలనాయుడు, సీతమ్మధార మండల విద్యాశాఖాధికారులు డి.రామారావు, బాలామణి పర్యటించారు. బడి బయట ఉన్న నలుగురు విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మౌలిక వసతులు, మధ్యాహ్న భోజన పథకం, ఆరోగ్య పరీక్షలు, స్టూడెంట్ కిట్స్, విద్యా ప్రమాణాలను వివరించి విద్యార్థులను బడిలో చేర్పించారు.

సిద్ధమమవుతున్న అన్న క్యాంటీన్లు

... 5వ పేజీ తరువాయి

ఏ సమయానికి ఎంతమంది భోజనం చేస్తున్నారనేది తెలుసుకునేందుకు వీలుగా ఇంటర్‌నెట్ సదుపాయం కల్పించి, అమరావతిలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశారు. ఉదయం అల్పాహారం,మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం ఏదైనా రూ.5కే అందజేయడంతో 25చోట్ల కలిపి ప్రతిరోజూ సగటున పది వేల మంది అల్పాహారం, 15 వేల మంది వరకూ మధ్యాహ్నం భోజనం, పది వేల మంది వరకూ రాత్రి భోజనం చేసేవారు. అయితే 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో అన్న క్యాంటీన్లు మూతపడ్డాయి. ఇటీవలజరిగిన ఎన్నికల్లో కూటమి తిరిగి అధికారంలోకి రావడంతో అన్నక్యాంటీన్లనుఅందుబాటులోకితీసుకువచ్చేందుకు సిద్ధమైంది. జీవీఎం సీ పరిధి సెప్టెంబరు నుంచి అన్న క్యాంటీన్లు అందుబాటులోకి రాబోతున్నాయని తెలిసి పేదలు, సామాన్యులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

ఏయూకు పూర్వ వైభవం తీసుకువస్తాం

» రాజకీయాలకు అతీతంగా వర్సిటీలో పాలన

» సీఎం రమేష్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి, వంశీకృష్ణ

» వీసీ ప్రసాదరెడ్డి నిష్క్రమణతో వర్సిటీలో సంబరాలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్, (చిత్రంలో) ఎంపీ సీఎం రమేష్, వెలగపూడి, వంశీకృష్ణ తదితరులు

విశాఖపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా యూనివర్సిటీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం ఉదయం ఏయూలోని వీసీ కార్యాలయం ఎదుట కూటమి నేతలు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ సీఎం రమేష్ మాట్లాడుతూ ఏయూలో తాము ఈ కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసే ప్రసాదరెడ్డి రాజీనామా చేశాడన్నారు. రాజీనామా చేసినా, ఆయన చేసిన అక్రమాలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వర్సిటీలో పనిచేసే సిబ్బందిని, విద్యార్థులను గత ఐదేళ్లలో ప్రసాదరెడ్డి తీవ్రఇబ్బందులకు గురిచేశారని, ఇకపై వారంతా స్వేచ్ఛగా పనిచేసుకోవచ్చన్నారు. ప్రసాదరెడ్డి చేసిన ప్రతి ఒక్కదానికీ లెక్క తేలుస్తామన్నారు. విద్యా సంస్థల్లో రాజకీయ నేతల విగ్రహాలు పెట్టాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. ఏయూలో దాదాపు రూ.100 రూ సా నిధులను దుర్వినియోగం చేశారని ఆయన ఆరోపించారు. గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రసాదరెడ్డి అక్రమాలపై గవర్నర్, సీఎంకు ఫిర్యాదు చేసి న్యాయ విచారణ చేయిస్తామన్నారు. సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో రాజకీయాలకతీతంగా వర్సిటీలో పాలన సాగించేలా కృషి చేస్తామన్నారు.ఎమ్మెల్యే వెలగపూడి మాట్లాడుతూ ప్రసాదరెడ్డి వల్ల ఇబ్బందులకు గురైన ఉద్యోగులకు న్యాయం చేస్తామన్నారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ వీసీ దుర్మార్గ పాలన తొలగిందన్నారు.

వినతుల వెల్లువ..

వీసీ ప్రసాదరెడ్డి హయాంలో ఇబ్బందులకు గురైన పలువురు ఉద్యోగులు, విద్యార్థి సంఘ నాయకులు నేతలకు వినతులిచ్చారు. గెస్ట్ ఫ్యాకల్టీ తమను మళ్లీ తీసుకోవాలంటూ మీనన్ ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులు కోరారు. తనకు జరిగిన అన్యాయాన్ని పొన్నాడ శ్రీనివాసరావు వివరించారు. వందలాదిమంది వీసీ కార్యాలయం వద్దకు చేరుకుని బాణసంచా కాల్చిసంబరాలు చేసుకున్నారు. టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్ ఆధ్వర్యంలో మొత్తం గేట్లు తీయించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులుఆరేటి మహేష్‌ప్రొఫెసర్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు పాతర, అక్రమాల జాతర

... 5వ పేజీ తరువాయి

సెక్యూరిటీ సిబ్బందికి మాత్రం అలవెన్సులతో కలిపి సుమారు రూ.20 వేలకుపైగా ఇస్తున్నారు. సెక్యూరిటీ సిబ్బందిగా నియామకం సమయంలో ఖాన్‌కు వారంతా భారీగానే సమర్పించుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే, ఖాన్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా నియమితులైన తరువాత ట్రాన్స్‌పోర్ట్ డీన్‌గా కూడా వీసీ అవకాశం కల్పించారు. ఈ బాధ్యతలను ఖాన్ 'చక్కగా' వినియోగించుకున్నట్టు చెబుతున్నారు. ఏయూ వాహనాలకు ఆయిల్, ఇతర మరమ్మతులు నిర్వహణ పేరుతో నిధులు దుర్వినియోగం చేశారంటున్నారు. పూర్తిగా మూలకు చేరిన వాహనాలను విక్రయించుకున్నారని... ఆయన తీసుకున్న నిర్ణయాలపైనా విచారణ చేయాల్సిందిగా పలువురు కోరుతున్నారు.

రాజీనామా ఇంకెప్పుడు..?

పదవీ విరమణ తరువాత వివిధ బాధ్యతల్లో చేరిన అధికారులు అందరూ ఇప్పటికే రాజీనామా చేశారు. ఆఖరికి వీసీ, రిజిస్ట్రార్ కూడా పోస్టులు నుంచి తప్పుకున్నారు. కానీ, ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్ మాత్రం ఇంకా రాజీనామా చేయలేదు. ఇదే ఇప్పుడు వర్సిటీలో చర్చనీయాంశంగా మారింది. ఏడాదిన్నర కిందట పదవీ విరమణ చేసిన ఆయనకు మళ్లీ ప్రిన్సిపాల్‌గా ప్రసాదరెడ్డి అవకాశం ఇచ్చారు. ఆయన ఇప్పటికీ కొనసాగుతుండడం గమనార్హం.

దాతల ఇచ్చిన నిధుల లెక్క..?

గడిచిన ఐదేళ్లలో ఎన్నడూ లేని విధంగా యూనివర్సిటీ అధికారులు దాతల నుంచి భారీగా నిధులు సేకరించారు. కొందరు సొంత నిధులతో భవనాలు కట్టించగా, మరికొందరు వర్సిటీ అభివృద్ధికి వినియోగించాలంటూ నిధులు అందించారు. ఈ నిధులను ఏ ఖాతాలో జమ చేశారన్న దానిపై వర్సిటీ అధికారులకు సమాచారం లేకపోవడం గమనార్హం. వీటి వినియోగంపైనా దృష్టిసారిస్తామని కూటమి నేతలు శనివారం ప్రకటించారు.

ప్రక్షాళన చేయాల్సిందే!!

... 5వ పేజీ తరువాయి

చైర్ ప్రొఫెసర్లు తమతో సమానంగా రిజిస్టర్లలో సంతకాలు పెడితే ఊరుకోబోమని రెగ్యులర్ ప్రొఫెసర్లు అంటున్నారు. వారికి ప్రత్యేకంగా ఒక రిజిస్టర్ పెట్టుకోవాలని సూచిస్తున్నారు. అదేవిధంగా పలు విభాగాల్లో సీనియర్లు, సమర్థులు అనేక మంది ఉండగా వారిని కాదని, రిటైరైన వారికి, జూనియర్లకు కీలక బాధ్యతలు అప్పగించారు. ఈ నిర్ణయాలన్నింటినీ సమీక్షించి, అర్హత కలిగిన వారికి అవకాశం కల్పించాల్సి ఉంది. ప్రసాదరెడ్డి కంప్యూటర్స్ విభాగం ప్రొఫెసర్. ఆ విభాగంలోనే సీనియర్లకు అన్యాయం చేశారు. అక్కడి నుంచే ప్రక్షాళన ప్రారంభించాలనే డిమాండ్ వినిపిస్తోంది.

స్టీల్ ప్లాంటుపై ఎన్నాళ్లీ ఆర్థిక భారం?

... 5వ పేజీ తరువాయి

70 మంది బోధన, బోధనేతర సిబ్బంది ఉన్నారు. ప్రిన్సిపాల్‌కు నెలకు రూ.70 వేల జీతం. సీనియర్ టీచర్లకు రూ.50 వేలు. సీనియర్ బోధనేతర సిబ్బందికి రూ.35 వేలు. వీరు కాకుండా అవుట్‌సోర్సింగ్‌లో మరో 20 మంది టీచర్లు ఉన్నారు. వారికి రూ.15 వేలు ఇస్తున్నారు. జీతాలకు నెలకు రూ.35 లక్షలు ఖర్చు అవుతోంది. స్టీల్‌ప్లాంటు ఐదేళ్లకొకసారి ఎంఓయూ చేసుకుని రూ.7 కోట్లు ఇస్తోంది. తమ ఆర్థిక స్థితి బాగా లేనందున ఇకపై సాయం చేయలేమని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని గత నెలలో తెగేసి చెప్పింది. ఆ మేరకు ఏర్పాట్లు చూసుకోకుండా డయసిస్ యాజమాన్యం పూర్తిగా విద్యాలయాన్నే మూసివేసేందుకు సిద్ధమైంది. విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగడంతో ప్రస్తుతానికి తరగతులు నిర్వహిస్తోంది.

కోర్టుకు వెళ్లి ఆదేశాలు

విద్యాలయాన్ని నిర్వహించేది కేంద్ర ప్రభుత్వానికి చెందిన స్టీల్‌ప్లాంటు. నిబంధనలు కూడా అవే వర్తిస్తాయి. ఆ మేరకు 60 ఏళ్లకు విద్యాలయంలో టీచర్లకు రిటైర్‌మెంట్ ఇవ్వాలి. అలా చేస్తే కొందరు కోర్టుకు వెళ్లి, రాష్ట్ర ప్రభుత్వం 62 ఏళ్లు చేసిందని, తమకూ వర్తిస్తుందంటూ ఆదేశాలు తెచ్చుకున్నారు. ఇలా ఓ పది మంది వరకు కొనసాగుతున్నారు. దీనిని స్టీల్ యాజమాన్యం అంగీకరించడం లేదు.

సరిగ్గా వ్యవహరించని డయసిస్

విద్యాలయ నిర్వహణ బాధ్యత తీసుకున్న డయసిస్ సరిగ్గా వ్యవహరించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఆరోపణలు వస్తున్నా ఆదాయ వ్యయాల వివరాలు వెల్లడించకపోవడం వంటివి అనుమానాలకు తావిస్తున్నాయి.

స్థాయీ సంఘాల్లోకి నూతన ఎమ్మెల్యేలు

... 5వ పేజీ తరువాయి

అనకాపల్లి జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారిని ఆదేశించారు.

అలిగిన జడ్పీటీసీ సభ్యుడు

ఆరో స్థాయీ సంఘ చైర్‌పర్సన్‌గా ఉన్న రావికమతం జడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో ఆమె స్థానంలో తొలుత మునగపాక జడ్పీటీసీ సభ్యుడు సత్యనారాయణను తాత్కాలికంగా నియమించి ఆ సమాచారాన్ని ఆయనకు ఇచ్చారు. అయితే ఆ తరువాత మహిళ మాత్రమే చైర్‌పర్సన్‌గా ఉండాలన్న నిబంధన మేరకు నాతవరం జడ్పీటీసీ సభ్యురాలు అప్పలనర్సను నియమించారు. శనివారం ఆమె అధ్యక్షతన స్థాయీ సంఘ సమావేశం జరుగుతున్నప్పుడు మునగపాక జడ్పీటీసీ సభ్యుడు హాజరయ్యారు. చైర్‌పర్సన్‌గా తనను మార్చిన విషయం ముందుగా ఎందుకు చెప్పలేదంటూ అలిగి బయటకు వెళ్లిపోబోగా మిగిలిన సభ్యులు నచ్చజెప్పారు. కాగా అరకు ఎమ్మెల్యేగా ఎన్నికైన హుకుంపేట జడ్పీటీసీ సభ్యుడు మత్స్యలింగంను చైర్‌పర్సన్ సుభద్ర, సీఈవో పోలినాయుడు, డిప్యూటీ సీఈవో సత్యనారాయణ, సభ్యులు సత్కరించారు.

'పోషకాహారానికి ప్రాధాన్యమివ్వాలి'

డాబాగార్డెన్స్, జూన్ 29: రాత్రి వేళ తీసుకునే ఆహారంలో పోషకాలు కలిగి ఉండేలా ప్రాధాన్యం ఇవ్వాలని ప్రముఖ వైద్యులు రోహిణి పాటిల్ తెలిపారు. శనివారం సాయంత్రం డాబాగార్డెన్స్‌లోని ఓ హాల్‌లో 'ఆహారం - ఆరోగ్యం' అనే అంశంపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాత్రి వేళ కాటేజీ చీజ్, బాదం, గ్రీక్‌యోగర్ట్, కివి పండ్లు, చెర్రీ, టమాటాలు, హార్డ్ బాయిల్డ్ గుడ్లను ఆహారం తీసుకోవడం చాలా మంచిదన్నారు.


బర్మాకాలనీలో నిరుపయోగంగా ఉన్న తుఫాన్ షెల్టర్


ఇప్పటికే సగం కూలిన యాతపాలెంలోని తుఫాన్ షెల్టర్


వెంకన్నపాలెంలో తుఫాన్ షెల్టర్ దయనీయంగా ఉన్న దృశ్యం

శిథిలావస్థలో తుఫాన్ షెల్టర్లు

» ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయాందోళన చెందుతున్న ప్రజలు

» వీటిని కూల్చివేసి ప్రజావసరాలకు వినియోగించాలని వేడుకోలు

పెదగంట్యాడ, జూన్ 29: మండలంలోని పలు ప్రాంతాల్లో ఉన్న తుఫాన్ షెల్టర్లు శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. తుఫాన్‌లు, భారీ వర్షాలు, వరదలు వంటి విపత్కర సమయాల్లో స్థానికులు తలదాచుకునేందుకు వీలుగా నిర్మించిన తుఫాన్ షెల్టర్లు ఇప్పుడు ఏ క్షణాన కూలిపోతాయోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడు దశాబ్దాల క్రితం లక్షలాది రూపాయలు వెచ్చించి ప్రభుత్వం వీటిని నిర్మించింది. ప్రభుత్వం ఏ సదుద్దేశంతో వీటిని నిర్మించిందో అందుకు ఇవి ఉపయోగపడకపోగా... ఇప్పుడు వీటివల్ల ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

మండలంలోని బర్మాకాలనీ, నడుపూరు, దుర్గవానిపాలెం, వెంకన్నపాలెం, గంగవరం, యాతపాలెం, తదితర ప్రాంతాల్లో వీటిని నిర్మించింది. ఎప్పటికప్పుడు వీటిని పర్యవేక్షించకపోవడం, వినియోగించకపోవడం వంటి కారణాలతో ఇవి పూర్తిగా శిథిలమయ్యాయి. కాగా ఒకటి, రెండు తుఫాన్ షెల్టర్లను స్థానికులు ప్రజావసరాల కోసం వినియోగించుకోవడం, మరమ్మతులకు గురైన వాటిని బాగు చేయించడంతో వీటిలోని కొన్ని గదులు కాస్త బాగున్నాయి. మిగిలిన వాటి పరిస్థితి మాత్రం ప్రమాదకరంగా ఉన్నాయి. వెంకన్నపాలెం, యాతపాలెం, బర్మా కాలనీలలో ఉన్న తుఫాన్ షెల్టర్లు అయితే పూర్తిగా పాడైపోవడంతో ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. స్థానికంగా నివాసం ఉంటున్న వారి పిల్లలు ఉదయం, సాయంత్రం వేళల్లో శిథిలమైన తుఫాన్ షెల్టర్ల లోపల ఆటలాడుకుంటున్నారు. అలాంటి సమయంలో ఏదైనా జరగకూడని ప్రమాదం జరిగితే నష్టం తీవ్రంగా ఉంటుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందువల్ల పూర్తిగా శిథిలమైన తుఫాన్ షెల్టర్లను తొలగించి వాటి స్థానంలో కమ్యూనిటీ భవనాలు, గ్రంథాలయాలు, ప్రభుత్వ హెల్త్ క్లినిక్‌లు, షాపింగ్ కాంప్లెక్సులు వంటి వాటిని నిర్మించాలని గత పదేళ్లుగా జీవీఎంసీ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నా ఫలితం శూన్యంగా ఉంటుందని స్థానికులు వాపోతున్నారు. రానున్నది వర్షాకాలం కాబట్టి ఈ తుఫాన్ షెల్టర్లు నానిపోయి కూలిపోయే ప్రమాదం ఉందని, అధికారులు స్పందించి వీటిని తొలగించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పిల్లల పార్కులుగా తీర్చిదిద్దాలి



శిథిలమైన తుఫాన్ షెల్టర్లను తొలగించి ఆయా స్థలాలను పిల్లలు ఆడుకునేందుకు గాను పార్కులుగా తీర్చిదిద్దాలి. పార్కులను అందుబాటులోకి తెస్తే ఆయా ప్రాంతాల్లోని చిన్నారులు ఆటలాడుకునేందుకు, వృద్ధులు సేదదీరేందుకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి. తుఫాన్ షెల్టర్లు కూలిపోక ముందే అధికారులు తగిన చర్యలు చేపట్టాలి.

-పెద్దాడ సోమునాయుడు, దుర్గవానిపాలెం

నార్త్ సింహాచలం నుంచి కొత్తవలస వరకు అదనపు ట్రాక్ నిర్మాణం

నెల రోజుల్లో పనులు చేపట్టేందుకు రైల్వే అధికారులు సన్నాహాలు

పెందుర్తి-రూరల్, జూన్ 29: నార్త్ సింహచలం రైల్వే స్టేషన్ నుంచి కొత్తవలస స్టేషన్ వెళ్లే మార్గ మధ్యలో ప్రధాన ట్రాక్‌లలో తరచూ గూడ్స్ రైళ్లు నిలిపివేస్తుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో అదనపు రైల్వే ట్రాక్ నిర్మాణానికి ఈస్ట్‌కోస్ట్ రైల్వేశాఖ కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం ఉన్న రైలు మార్గానికి ఆనుకుని నార్త్ సింహచలం నుంచి కొత్తవలస వైపు నున్న ఖాళీ స్థలంలో ట్రాక్ నిర్మాణానికి చర్యలు చేపడుతోంది.

ఇందుకు సంబంధించి స్థల ఎంపిక, నిర్ధారణ పనులు అధికారికంగా ఇప్పటికే ఖరారయ్యాయి. మరో నెల రోజుల్లో ఆ పనులను ప్రారంభించనున్నట్టు రైల్వే అధికారులు చెబుతున్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ నుంచి కిరండోల్, రూర్కేల ప్రాంతాలకు రాకపోకలు సాగించే గూడ్స్ రైళ్ల సంఖ్య ఇటీవల కాలంలో పెరిగింది. దీంతో స్టేషన్లలో ప్లాట్‌ఫారాలు ఖాళీలేని సమయంలో క్యాబిన్ల అవతల గల కిరండోల్ ప్రధాన మార్గంలో ఎక్కడికక్కడ గూడ్స్ రైళ్లను నిలిపివేయాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ప్లాట్‌ఫారాలపై రైళ్లను గంటల తరబడి నిలిపివేయడం వల్ల అనేక రైళ్ల రాకపోకలకు అంతరాయం వాటిల్లుతుంది. వీటితో పాటు విశాఖ నుంచి భువనేశ్వర్, రాయగడ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్‌లు, ప్యాసింజర్ రైళ్లు సైతం తరచూ స్టేషన్లలో నిలిపేయాల్సి వస్తోంది. వీటన్నింటి దృష్ట్యా గూడ్స్ రైళ్ల రాకపోకల నిమిత్తం అదనంగా మరో ట్రాక్ నిర్మించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

నార్త్ సింహచలం నుంచి పోర్లుపాలెం ఆంధ్రా సిమెంట్ కంపెనీ వరకు నేల భాగంలో ట్రాక్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. సిమెంటు కంపెనీ నుంచి పోర్లుపాలెం, చింతలఅగ్రహారాల మీదగా వేపగుంట, పినగాడి ఆర్వోబీ వరకు ఐరన్ గడ్డర్‌లతో బ్రిడ్జి నిర్మించి పై భాగంలో కాంక్రీటు వేసి ట్రాక్ నిర్మించనున్నారు. అలాగే ఆర్వోబీ నుంచి కొత్తవలస వరకు తిరిగి ట్రాక్ నిర్మించనున్నారు.

గ్రావెల్ సేకరణకు ఏర్పాట్లు

కొత్త ట్రాక్ నిర్మించేందుకు గాను సదరు స్థలాన్ని ముందుగా గ్రావెల్‌తో పూడ్చనున్నారు. ఇందులో భాగంగా మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌లో పేరుకుపోయిన పూడికను సంబంధిత కాంట్రాక్టర్ గ్రావెల్‌గా ఉపయోగించనున్నారు. పూడిక తరలింపుతో రిజర్వాయర్ గర్భం లోతుగా మారి నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని భావించిన జలాశాయం అధికారులు ఇందుకు సానుకూలంగా స్పందిస్తున్నారు. ఇక గనుల శాఖ అనుమతులు రావడమే మిగిలి ఉన్నట్టు తెలిసింది.


ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఉక్కు నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని ఎంపీ రమేశ్‌కు వినతి

గాజువాక, జూన్ 29: ఉక్కు కర్మాగారం నిర్వాసితులకు ఉపాధి కల్పించేందుకు కృషి చేయాలని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్‌ను బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావుతో పాటు పలువురు నాయకులు కోరారు. ఈ మేరకు నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఎంపీని కలిసి వినతిపత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్ కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు అన్ని విధాల అన్యాయం జరిగిందన్నారు. బీజేపీ ప్రభుత్వంలో స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులకు ఉపాధి కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీని కలిసిన వారిలో నాయకులు గూటూరు శంకరరావు, తాతారావు, నాగేశ్వరరావు, ముసలయ్య ఈశ్వరరావు, తదితరులు ఉన్నారు.

సినిమా గైడ్

- **మహారాజ :** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), తాతా సీతారామయ్య (పరవాడ), (తగరపువలస)
- **ప్రభుత్వ జూనియర్ కళాశాల :** రమాదేవి, వెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), లక్ష్మికాంత్ (గాజువాక),
- **మనమే :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **హరోం హర :** శ్రీరామ, శారద, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక)
- **హనీమూన్ ఎక్స్‌ప్రెస్ :** రమాదేవి, శ్రీనరసింహ (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
- **ఓజీ :** శ్రీవెంకటేశ్వర, సంగం, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **భజే వాయు వేగం :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 35, టమాటా 42, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 24, పచ్చిమిర్చి 88, కాకరకాయలు 48, బీరకాయలు 42, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 40, క్యాబేజీ 30, క్యారెట్ 38, దొండకాయలు 26, బంగాళదుంపలు 32, అరటికాయ (పె)6, అల్లం (పాతది) 150, మునక్కాడలు (కిలో) 105, బరబాటి 60, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 38, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 126, పొటల్స్ 32, కీరదోస 32, క్యాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 36, కంద 60, దేముడుచిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు

బ్రాయిలర్

రైతు ధర	-- 120
ఫారం ధర	-- 140
విత్ స్కిన్	-- 250
స్కిన్‌లెస్	-- 260

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 12లో..

సెయిల్‌లో స్టీల్‌ప్లాంట్ విలీనానికి మోదీపై ఒత్తిడి తేవాలి

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ


దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ఆదినారాయణ

కూర్మన్నపాలెం, జూన్ 29: స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేసేందుకు అఖిలపక్ష పార్టీల సమావేశాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నిర్వహించి ప్రధాన మంత్రి మోదీపై ఒత్తిడి తేవాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 1234వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ కేంద్ర ప్రభుత్వ కుట్రలో భాగమేనని, చిన్నాభిన్నమైన ఉక్కు కర్మాగారాన్ని సీఎం చంద్రబాబు గాడిలో పెట్టగలరని కార్మికులందరూ విశ్వసిస్తున్నారన్నారు. స్టీల్‌ప్లాంటుకు సొంత గనులు కేటాయిస్తే పురోభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా కేంద్రం తమ మొండి వైఖరిని విడనాడాలని, ఉత్తరాంధ్ర సంజీవని అయిన స్టీల్‌ప్లాంటును పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఉక్కును కాపాడేందుకు ఏకతాటిపై నడవాలి

ఉక్కుటౌన్ షిప్: స్టీల్‌ప్లాంటును కాపాడుకునేందుకు కార్మికులంతా ఏకతాటిపై నడవాలని డీవీఆర్‌ఈఎస్‌యూ ప్రధాన కార్యదర్శి డీవీ రమణారెడ్డి పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్‌లో శనివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ పరిశ్రమలను రక్షించుకునేందుకు కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు కేంద్రం చేస్తున్న యత్నాలను విరమించుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు గల్లా శంకర్ సాయిరాం, నూకరాజు, రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలతో నిలిచిన సామాజిక భవన నిర్మాణ పనులు

మల్కాపురం, జూన్ 29: ప్రకాశనగర్ ఏడుగుళ్ల జంక్షన్ సమీపంలో ఉన్న బావిని పూడ్చివేసి అక్కడ సామాజిక భవన నిర్మాణానికి జీవీఎంసీ సిద్ధం కాగా స్థానికులు అడ్డుకున్నారు. ఈ స్థలంలో గ్రౌండ్, మొదటి ఫ్లోర్‌లో సామాజిక భవనం నిర్మాణానికి జీవీఎంసీ రూ.25 లక్షలు కేటాయించింది. ఈ భవనం పొదుపు సంఘాల సభ్యుల అవసరం కోసమని జీవీఎంసీ సిబ్బంది చెబుతున్నారు. అయితే ఇక్కడ భవనం నిర్మించవద్దని, ఈ బావి వల్ల గతంలో తమ తాగునీటి అవసరాలు తీరేవని, అందువల్ల దీనిని వినియోగంలోకి తీసుకురావాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. పైగా సామాజిక భవనం నిర్మిస్తే తమ రాకపోకలకు కూడా ఇబ్బందులు తలెత్తవచ్చునని పలువురు అభ్యంతరం తెలిపారు. ఈ విషయాన్ని జీవీఎంసీ అధికారుల దృష్టికి సంబంధిత కాంట్రాక్టర్ తీసుకువెళ్లనున్నారు. అధికారుల నిర్ణయం తర్వాత పనులు చేపట్టేది లేనిదీ తేలుతుందని కాంట్రాక్టర్ పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు


వెంకటేశ్ (ఫైల్)

కూర్మన్నపాలెం, జూన్ 29: ఇంటి నుంచి బయటకు వెళిన వ్యక్తి తిరిగి రాకపోవడంతో దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కూర్మన్నపాలెం టీజీఆర్ కాలనీకి చెందిన వల్లపు వెంకటేశ్ (58) ఈ నెల 22న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో బంధువుల, తెలిసిన వారిని వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో దువ్వాడ పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలల హక్కులపై అవగాహన అవసరం

పెదగంట్యాడ, జూన్ 29: బాలల హక్కులు, చట్టాలపై బాలికలకు అవగాహన అవసరమని ఎంఈవో శ్రీనివాసరావు అన్నారు. బాలికలను రక్షిద్దాం-బాలికలను చదివిద్దాం కార్యక్రమాన్ని శనివారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టాయన్నారు. బాలికలకు రక్షణ వలయంగా అనేక చట్టాలు ఉన్నాయని, వీటిని బాలికలు గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు బి.విజయలక్ష్మి, టి.వరలక్ష్మి, ఎంవీ లక్ష్మి, సచివాలయ, పలు పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నేత డి.శ్రీనివాస్ మృతికి సంతాపం

గోపాలపట్నం, జూన్ 29: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ధర్మపురి శ్రీనివాసరావు మృతికి నగర పార్టీ నాయకులు సంతాపం తెలిపారు. ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రానికి రెండు సార్లు పీసీసీ అధ్యక్షునిగా విజవంతంగా బాధ్యతలు నిర్వహించి పార్టీ విజయానికి శ్రీనివాసరావు ఎంతో కృషి చేశారని కాంగ్రెస్ నాయకుడు సోడదాసి సుధాకర్ అన్నారు. శ్రీనివాసరావు మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు.

బాజీ జంక్షన్‌లో మొబైల్ టాయిలెట్ ఏర్పాటు

ఎన్.ఎ.డి.జంక్షన్, జూన్ 29: జీవీఎంసీ 90వ వార్డు పరిధి బాజీ జంక్షన్ సంతలో స్థానిక వర్తకులు, మహిళల కోసం జీవీఎంసీ ఆధ్వర్యంలో నిర్మించిన పింక్ మొబైల్ టాయిలెట్‌ను కార్పొరేటర్ బొమ్మిడి రమణ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ చిరు వ్యాపారాలు సాగిస్తున్న వారు పడుతున్న ఇబ్బందులను గుర్తించి జీవీఎంసీ ఈకో వైజాగ్ అధికారులతో మాట్లాడి మొబైల్ టాయిలెట్ ఏర్పాటు చేశామన్నారు. ఇది శని, సోమవారం సంత సమయాల్లో అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో శానిటరీ అధికారులు, పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.

విద్యార్థులు మేధస్సును పెంపొందించుకోవాలి

గోపాలపట్నం, జూన్ 29: విద్యార్థులు ప్రయోగాలు చేసే దిశగా తమ మేధస్సుకు పదును పెట్టాలని స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం కేవీపీ ప్రసాద్ అన్నారు. శనివారం పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో ప్రతినిధులు విద్యార్థులతో తరగతి పాఠ్యాంశాలపై ప్రయోగాలు చేయించారు. కార్యక్రమంలో జేవీవీ ప్రతినిధులు పీవీ గోపాలరావు, ఎస్వీ రమణ, ఈశ్వరరావు, శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీబీఎల్‌లో శ్రీవారికి ప్రత్యేక పూజలు


ఉభయ దేవేరులతో వేంకటేశ్వరస్వామి

అక్కిరెడ్డిపాలెం, జూన్ 29: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శనివారం వేంకటేశ్వర్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున వేదపండితులు స్వామి వారిని పంచామృతాలతో అభిషేకించి ప్రత్యేక పుష్పాలతో తోమాలసేవ చేశాక పూజలు జరిపారు. సాయంత్రం ప్రాంగణంలోని ప్రత్యేక వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవ విగ్రహాలను ఆశీనులను చేసి వివిధ రకాల పుష్పాలతో సహస్ర నామార్చన, నక్షత్ర హారతి ఇచ్చాక శాంతి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులతో పాటు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గ్రీన్ సిటీలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం


పూజలందుకున్న శ్రీవారు

కూర్మన్నపాలెం, జూన్ 29: జీవీఎంసీ 88వ వార్డు పరిధి వైజాగ్ ప్రొఫైల్స్ గ్రీన్ సిటీలో వైభవ్ వేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా విశ్వక్సేన ఆరాధన, భగవత్ పుణ్యాహవచనం, మత్సంగ్రహణం, పుట్టబంగారం తేవడం, తదితర పూజాది కార్యక్రమాలను ప్రధాన అర్చకులు వాసుస్వామి, శ్రీధర్‌స్వామి, తదితరులు శాస్త్రోక్తంగా జరిపారు. శ్రీవారికి ప్రత్యేక పూజలు చేయగా, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి దర్శించుకున్నారు. పలువురు మహిళలు అన్నమాచార్యుని భక్తి గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో వైజాగ్ ప్రొఫైల్స్ ఎండీ బండి సురేశ్‌కుమార్, డైరెక్టర్లు వీవీ కృష్ణారావు, పద్మజ, రాజ్యలక్ష్మి, చిన్న సురేశ్, మల్లికార్జున్, సుబ్రహ్మణ్యం, సునీల్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలకు నాయీ బ్రాహ్మణుల అభినందనలు

ఎన్.ఎ.డి.జంక్షన్, జూన్ 29: సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వెలగపూడి రామకృష్ణబాబు, పి.విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్‌లను జిల్లా నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నరవ పైడిరాజు, తదితరులు శనివారం మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు అరిపాక పెంటారావు, డి.రమేశ్, శ్రీను, సత్యనారాయణ, నారాయణరావు, శంకర్, గణపతిరావు, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

'మహిళల పురోభివృద్ధే ధ్యేయం'

మల్కాపురం, జూన్ 29: మహిళలో చైతన్యం నింపి వారు ఆర్థికంగా పురోభివృద్ధిసాధించడమే మల్కాపురం కళంజియా సమాఖ్యముఖ్య ఉద్దేశమని ధాన్ ఫౌండేషన్ రీజనల్ కో-ఆర్డినేటర్ కె.రామ్‌కుమార్ పేర్కొన్నారు. మల్కాపురం మరిడిమాంబ కల్యాణమండపంలో శనివారం పొదుపు సంఘాల సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏడు వార్డుల పరిధిలోని 440 పొదుపు సంఘాలు ఉన్నాయని, వీటిలో ఆరు వేల మంది కుటుంబాలతో పనిచేస్తున్నట్టు వివరించారు. సమాఖ్యలో ఉన్న నాలుగో వంతు సభ్యులు బయట అప్పుల నుంచి బయటపడ్డారని అన్నారు. సమాఖ్య విద్య, ఆరోగ్య, జీవనోపాధి సంబంధిత అంశా లలోనూ సేవలందిస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో కళంజియ సమాఖ్య కో-ఆర్డినేటర్ సాయికృష్ణ, సుభాషిణి, సమాఖ్య ప్రతినిధులు ఆదిలక్ష్మి, ఆర్.రేయమ్మ, నాగరత్నం, సరోజని, కృష్ణవేణి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీలో బ్యానర్, ప్లకార్డులు ప్రదర్శిస్తున్న దృశ్యం

మలేరియాపై అవగాహన ర్యాలీ

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 29: మలేరియా వ్యాధి నివారణపై అందరూ అవగాహన పెంచుకోవాలని జిల్లా మలేరియా అధికారి తులసి అన్నారు. మలేరియా వారోత్సవాల సందర్భంగా స్టీల్‌ప్లాంట్ మలేరియా విభాగం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రజలందరూ తమ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే దోమలు దరిచేరవని, దీంతో వ్యాధులు ప్రబలవన్నారు. ముందు జాగ్రత్తలతోనే వ్యాధులను నివారించుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ జీఎం చంద్రశేఖర్, మలేరియా విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో పాము పట్టివేత


పట్టుకున్న పాముతో సురేశ్‌కుమార్

పెదగంట్యాడ, జూన్ 29: జీవీఎంసీ 75వ వార్డు పరిధి నెల్లిముక్కు ప్రాథమిక పాఠశాల ఆవరణలో శనివారం పాము కనిపించడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోలనకు గురయ్యారు. ఈ విషయాన్ని ఉపాధ్యాయులు ఎంఈవో శ్రీనవాసరావు దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన స్నేక్ సేవర్ సొసైటీకి ఫోన్ చేశారు. ఈ మేరకు సొసైటీ సభ్యుడు రొక్కం సురేశ్‌కుమార్ పాఠశాలకు వచ్చి సుమారు ఐదున్నర అడుగుల నాగజెర్రి పామును ఎంతో చాకచక్యంగా పట్టుకోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

సాంకేతిక పరిజ్ఞానానికి 'మై భారత్' దోహదం

మల్కాపురం, జూన్ 29: యువతలో ఆచరణాత్మక నాయకత్వానికి, సాంకేతిక విషయ పరిజ్ఞానానికి మై భారత్ పోర్టల్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి ఈవీఎస్ భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో శనివారం నిర్వహించిన యువజన సదస్సులో ఆమె మాట్లాడుతూ ఈ నెల 24న గీతం కళాశాలలో మై భారత్ పోర్టల్‌పై నిర్వహించిన శిక్షణకు తాను, సీనియర్ ప్రోగ్రామ్ అధికారి అనసూయాదేవి హాజరయ్యామన్నారు. అక్కడ నేర్చుకున్న అంశాలు యువతకు ఎంతో ఉపయోగకరమన్నారు. యోగా, పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛభారత్, తదితర అంశాల్లో యువత నిర్వహిస్తున్న పాత్రను మై భారత్ పోర్టల్ ద్వారా తెలుసుకోవచ్చునని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఈ పోర్టల్‌పై యువతకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా వారిని కళాశాల సిబ్బంది సన్మానించారు.

డీఎస్సీ అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ ఉచిత శిక్షణ

విశాఖపట్నం, జూన్ 29 : డీఎస్సీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు ఏపీ బీసీ స్టడీ సర్కిల్ ఇన్‌చార్జి డైరెక్టర్ శ్రీదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు వచ్చే నెల 8వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. 200 మంది అభ్యర్థులకు రెండు నెలలు పాటు ఉచిత శిక్షణతో పాటు స్టైపెండ్ రూ. 3 వేలు, రూ. వెయ్యి విలువైన స్టడీ మెటీరియల్ అందిస్తామని తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తుతో పాటు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కుల జాబితా, టీటీసీ, టెట్‌లో అర్హత సాధించిన మార్కుల జాబితా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు (తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్షలోపు మాత్రమే), ఆధార్, బ్యాంకు పాస్ బుక్ జెరాక్స్, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలను జత చేసి, బీసీ స్టడీ సర్కిల్, ఎంవీపీ కాలనీ, విశాఖపట్నం అన్న చిరునామాకు నేరుగా పంపించాలని కోరారు. పూర్తి వివరాలకు ఫోన్ నెంబరు 94925 69177లో సంప్రతించాలని ఆమె సూచించారు.

ఎంపీ రామ్మోహన్‌నాయుడుకి స్వాగతం


రామ్మోహన్‌నాయుడుకి స్వాగతం పలుకుతున్న అభిమానులు

గోపాలపట్నం, జూన్ 29: కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. శనివారం ఉదయం 7.30 గంటలకు ఢిల్లీ నుంచి విశాఖ చేరుకున్న ఆయనకు టీడీపీ నేతలు, అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో శ్రీకాకుళం బయలుదేరి వెళ్లారు.

స్పీకర్ అయ్యన్నపాత్రుడిని కలిసిన పంచకర్ల


అయ్యన్నపాత్రుడిని సత్కరిస్తున్న పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, జూన్ 29: ఏపీ అసెంబ్లీ స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించి నగరానికి విచ్చేసిన నర్సీపట్నం ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్న పాత్రుడును శనివారం పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. విమానాశ్రయంలో అయ్యన్నకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి పంచకర్ల సత్కరించారు. శాసన సభాధిపతిగా అయ్యన్న నియామకంతో బీసీలకు సముచిత న్యాయం లభించిందని పంచకర్ల పేర్కొన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి నారాయణరావు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

అగనంపూడి, జూన్ 29: స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు వద్ద ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కె.సంజీవరావు అనే వ్యక్తి కుటుంబానికి లూబ్రికేషన్ అండ్ హైడ్రాలిక్స్ విభాగానికి చెందిన జీఎం ఎ.బెనర్జీ శనివారం 30 వేల రూపాయలను ఆర్థిక సాయంగా అందజేశారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సంజీవరావు కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని కోరారు. సంజీవరావు అవయవాలను దానం చేసిన కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు.

కూరగాయల ధరలను నియంత్రించాలని నిరసన


నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు, కార్మికులు

పెందుర్తి, జూన్ 29: సామాన్యులకు అందుబాటులో ఉండేలా కూరగాయల ధరలను నియంత్రించాలని ఏపీ మహిళా సమాఖ్య మండల శాఖ, సీపీఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక రైతుబజార్ ఎదుట ఈ మేరకు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కూరగాయలు, నిత్యావసర ధరలు పెరుగుదలను ప్రభుత్వం తక్షణం నియంత్రించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరావు, రాంబాబు, అన్నపూర్ణ, మహిళలు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి సిద్ధం: ఎంపీడీవో

పెందుర్తి, జూన్ 29: లబ్ధిదారులకు సామాజిక పింఛన్లను జూలై ఒకటో తేదీ ఉదయం ఆరు గంటల నుంచి పంపిణీ చేసేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఎంపీడీవో రవికుమార్ ఆదేశించారు. శనివారం పింఛన్ల పంపిణీపై మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారుల ఇళ్ల వద్దకే పింఛన్ల పంపిణీ చేయాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. జాప్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కూరగాయల మార్కెట్ సమస్యలు పరిష్కరిస్తా

» దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్


వంశీకృష్ణను గజమాలతో సత్కరిస్తున్న మార్కెట్ కమిటీ సభ్యులు

జ్ఞానాపురం, జూన్ 29: జ్ఞానాపురంలోని వైష్ణవి వెజిటేబుల్ హోల్‌సేల్ మార్కెట్‌లో సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధించిన సందర్భంగా ఎమ్మెల్యేను మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ మేరకు ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ హోల్‌సేల్ మార్కెట్‌లో సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని కోరారు. నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని పేర్కొన్నారు. ఎన్నికల ముందు హోల్‌సేల్ మార్కెట్‌లో తనకు ఘన స్వా గతం పలికి, మద్దతు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. అనంతరం కూడలిలోని సౌభాగ్య గణపతి ఆలయం వద్ద జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హోల్‌సేల్ మార్కెట్ అధ్యక్షుడు వీర్రాజు, సెక్రటరీ పరమేశ్వరరావు, సత్యనారాయణ, ప్రసాద్, రాంబాబు, ఐతి మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఐటీ రంగాభివృద్ధికి మొదటి ప్రాధాన్యం

» ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, లోకం నాగ మాధవి
» ఘనంగా ఐటీఏపీ వార్షికోత్సవం



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సిరిపురం, జూన్ 29 : వైసీపీ పాలనలో చితికిలపడిన ఐటీ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం సరైన నిర్ణయాలు, ప్రణాళికలతో ముందుకు వెళ్తుందని ఉత్తర, నెల్లిమర్ల ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, లోకం నాగ మాధవి స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం సిరిపురం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఐటీఏపీ) విశాఖపట్నం వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖలో 30 వేల మంది ఐటీ ఉద్యోగులు ఉన్నారని, వారు ఏ సమస్య వచ్చినా... తమను సంప్రతించవచ్చునని చెప్పారు. సమాజాభివృద్ధిలో ఐటీ ఉద్యోగుల పాత్ర గొప్పగా ఉండాలన్నారు. ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ విశాఖలో ఐటీ రంగాన్ని మరింతగా అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. ఐటీఏపీ ప్రెసిడెంట్ లక్ష్మీ ముక్కవల్లి మాట్లాడుతూ 2016లో ఐటీఏపీని ప్రారంభించామన్నారు.కొన్నేళ్ల తరువాత వార్షిక వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ఐటీఏపీ వైస్ ప్రెసిడెంట్ కిషోర్ దాసరి మాట్లాడుతూ ఐటీ రంగం మరింత పురోభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కాగా ఐటీ ఉద్యోగులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలుదుమ్ములేపాయి. ఉద్యోగులు చేసిన పలు డ్యాన్స్‌లు హోరెత్తించాయి. సంబంధిత విభాగాల హెచ్‌ఓడీలు సైతం వారిని ప్రోత్సహిస్తూ డ్యాన్స్‌లు వేయడంతో ఆడిటోరియమంతాసందడి వాతావరణాన్ని తలపించింది. ఈ కార్యక్రమంలో ఐటీఏపీ మాజీ ప్రెసిడెంట్ కొనరాజు శ్రీధర్, ఐటీఏపీ సభ్యులు, వివిధ స్టారప్ కంపెనీల సీఈఓలు పాల్గొన్నారు.

స్పీకర్ అయ్యన్నపాత్రుడికి అభినందనలు


స్పీకర్ అయ్యన్నకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సత్యనారాయణ

జగదాంబ కూడలి, జూన్ 29: ఏపీ అసెంబ్లీ స్పీకర్‌గా నియమితులై విశాఖ విచ్చేసిన అయ్యన్న పాత్రుడ్ని దక్షిణ నియోజవర్గం ఎమ్మెల్యే వ ంశీకృష్ణ, 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి బాస్కరరావు శనివారం మ ర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ స్పీకర్‌ను శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పా ల్గొన్నారు.

సీతమ్మధార: శాసనసభా స్పీకర్ ఎన్నికైన చింతకాయల అయ్యనపాత్రుడును డిప్యూటీ మాజీ మేయర్, టీడీపీ నాయకుడు దాడి సత్యనారాయణ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ స్పీకర్‌గా ఎన్నికైన అయ్యన్నపాత్రుడు బీసీ నాయకుడు, ఉత్తరాంధ్ర జిల్లా వాసి కావడం అందరికీ గర్వకారణమన్నారు. రాష్ట్రంలో వెనుకబడి ఉన్న ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి అయ్యన్నపాత్రుడు కృషి చేయాలని కోరారు. పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి తులసీ దళార్చన

జగదాంబ కూడలి, జూన్ 29: వన్‌టౌన్ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శనివారం సహస్ర తులసీ దళార్చన సేవలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 8గంటల సమయంలో అ మ్మవారిని తులసీ దళాలతో అలంకరించి అర్చకులు ఉభయదాతలతో పూజలు జరిపించారు. ఈ పూజల్లో ఈవో శ్రీనివాసుల రెడ్డి, ఏఈవో వి.రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు,అనంతరం భక్తులకు ఆలయ ప్రవేశం కల్పించారు.

బాలికల ఐటీఐల్లో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కంచరపాలెం, జూన్ 29 : కంచరపాలెం ప్రభుత్వ బాలికల ఐటీఐలో సీట్ల భర్తీకి అభ్యర్థులనుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జీవీ రమణారావు పేర్కొన్నారు. ఐటీఐ రెండో విడత కౌన్సెలింగ్ ప్రారంభంకానున్న నేపథ్యంలో బాలికల సీట్ల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆయన సూచించారు. 2024-2025 విద్యాసంవత్సరానికి గాను డ్రస్ మేకింగ్, కోపా ట్రేడుల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. పదో తరగతి పాసైన బాలికలు తమ దరఖాస్తులను ఐటీఐ వెబ్‌సైట్ ద్వారా సమర్పించడానికి జూలై 24వ తేదీ వరకు గడువు ఉందన్నారు.జూలై 27, 28 తేదీల్లో మెరిట్ అభ్యర్థులకు బాలికల ఐటీఐ ప్రాంగణంలో కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. దరఖాస్తుదారులు తమ అన్నీ ఒరిజినల్ సర్టిఫికెట్లతో సమీపంలో గల ప్రభుత్వ ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకుని తగిన రసీదును పొందాలన్నారు.

ఆనందపురం తహసీల్దార్‌కు షోకాజ్ నోటీసు

» ఆంధ్రజ్యోతి ఎఫెక్టు

విశాఖపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆనంద పురం మండలం రామవరంలో సర్వేనంబర్ 164-3లో ప్రభుత్వం వెనక్కి తీసుకున్న డీపట్టా భూమికి ఫ్రీహోల్డ్ చేసిన తహసీల్దార్ హేమంత్‌కుమార్‌కు జిల్లా కలెక్టర్ షోకాజ్ నోటీసు జారీ చేశారు. రామవరంలో పలు సర్వే నంబర్లలో ఉన్న డీపట్టా భూములకు సంబంధిత రైతులకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు జారీ చేశారు. ఈ క్రమంలో అక్కిరెడ్డి బంగారయ్య అనే రైతుకు సర్వే నంబర్ 164-3లో 1.53 ఎకరాలకు ప్రభుత్వం గతంలో డీపట్టా ఇచ్చింది. అయితే ఈ భూమిని మరో వ్యక్తికి లీజుకు ఇచ్చేయడంతో గ్రామస్థుల ఫిర్యాదుతో మూడేళ్ల క్రితం డీపట్టాను అప్పటి తహసీల్దారు రద్దు చేసి పేదల ఇళ్ల స్థలాలకు కేటాయించడం జరిగిపోయింది. ఈ విషయాన్ని పక్కన పెట్టిన మండల తహసీల్దార్, వీఆర్వో, ఇతర అధికారులు సర్వేనంబరు 164-3లో 1.53 ఎకరాలను ఫ్రీహోల్డ్ చేస్తూ ఆదేశాలు జారీ చేయడాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. దీనిపై బదిలీపై వెళ్లిన కలెక్టర్ మల్లికార్జున ఆదేశాలతో భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి విచారణ చేపట్టారు. ఫ్రీహోల్డు చేసిన సర్టిఫికెట్‌ను రద్దు చేసి ఆనందపురం తహసీల్దార్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. అలాగే గ్రామ రెవెన్యూ అధికారిపై చర్యలకు సిఫారసు చేశారు.

నేడు రవాణా, క్రీడల మంత్రి రాక

విశాఖపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖా మంత్రి ఎం.రాంప్రసాదరెడ్డి ఆదివారం నగరానికి రానున్నారు.మధ్యాహ్నం 1.40 గంటలకు ఆయన ఎయిర్‌పోర్టుకు చేరుకుని రాడిసన్ బ్లూ హోటల్‌కు చేరుకుంటారు. అక్కడ సాయంత్రం ఐదు గంటలకు ఆంధ్రా ప్రీమియర్ లీగ్‌ను ప్రారంభించి, రాత్రికి అక్కడే బసచేస్తారు. జూలైఒకటిన రాడిసిన్ బ్లూ హోటల్ నుంచి శ్రీకాకుళం జిల్లా పర్యటనకు బయలుదేరి వెళ్లి తిరిగి మధ్యాహ్నం ఒంటిగంటకు ద్వారకా బస్‌స్టేషన్‌కు చేరుకుని అక్కడ తనిఖీలు నిర్వహిస్తారు. ప్రజా రవాణాశాఖ అధికారులు, ఉద్యోగులతో సమావేశమై సాయంత్రం ఐదున్నరకు ఎయిర్‌పోర్టుకు చేరుకుని విజయవాడ వెళతారు.

పింఛన్ల పంపిణీ ఏర్పాట్లు పరిశీలన


సచివాలయ సిబ్బందితో చర్చిస్తున్న కూటమి నాయకులు

కంచరపాలెం, జూన్ 29 : సచివాలయాల ద్వారా జూలై ఒకటో తేదీ నుంచి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపట్టిన నేపథ్యంలో జీవీఎంసీ 54వ వార్డులో కూటమి నాయకులు శనివారం ఈ ఏర్పాట్లను పర్యవేక్షించారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు కుట్టా కార్తీక్,బీజేపీ అధ్యక్షుడు రంగుముద్ర రాంబాబు, ఇతర కమిటీ ప్రతినిధులు రెడ్డికంచరపాలెం, రైతుబజారు, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, మర్రిపాలెం తదితర ప్రాంతాల్లోని సచివాలయాలను సందర్శించి సిబ్బందితో మాట్లాడి ఏర్పాట్లు పరిశీలించారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఫించన్ల పంపిణీలో తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉప్పాడ శేఖర్, కొలుసు సత్యారావు, కాళ్ల అదిబాబు తదితరులు పాల్గొన్నారు.

సీహార్స్ జంక్షన్ వద్ద కాలువలో పూడికలతీత


పూడికతీత పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ భాస్కరరావు, అధికారులు

పూర్ణామార్కెట్, జూన్ 29: వన్‌టౌన్ సీహార్స్ ఎస్‌ఎల్ కెనాల్‌లో పేరుకుపోయిన పూడికలను శనివారం వార్డు కార్పొరేట్ విల్లూరి భాస్కరరావు పర్యవేక్షణలో జీవీఎంసీ సిబ్బంది తొలగించారు. కెనాల్ ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోవడంతో మురుగునీరు రోడ్డుపైకి వచ్చేస్తోంది. దీంతో జీవీఎంసీ సిబ్బందితో కార్పొరేటర్ పూడిక తీత పనులతో చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలను కాలువల్లో వేయవద్దని సూచించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

7న లతారాజా ఫౌండేషన్ స్కాలర్‌షిప్ పరీక్ష

డాబాగార్డెన్స్, జూన్ 29: హైదరాబాద్‌కు చెందిన లతారాజా ఫౌండేషన్ ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేసి స్కాలర్‌షిప్స్ అందించేందుకు జూలై 7న పరీక్షను నిర్వహిస్తున్నట్టు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కేకే రాజా తెలిపారు. శనివారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖలోని ఎండాడ వద్ద ఉన్న ఎయిమ్స్ కాలేజీలో ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, హ్యూమన్‌రిసోర్స్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ , ఆపరేషన్స్, రిటైల్, ఫారిన్ ట్రేడ్ మేనేజ్‌మెంట్ (పీజీడీఎం)లో ఐదుగురు విద్యార్థులకు 100 శాతం ఆర్థిక సహాయంతో విద్య నందిస్తామన్నారు. యాక్స్ కాలేజీ డిగ్రీలో బీటీఏ, బీకాం, బీఎస్సీ, వంటి కోర్సులకు ఇద్దరు చొప్పున 14 మంది కి 100శాతం ఈ స్కాలర్‌షిప్ మంజూరుకు పరీక్షను నిర్వహిస్తున్నామన్నారు.ట్రస్టీ డా.సిద్దోజీరావు తల్లిదండ్రులు లేని విద్యార్థులకు ప్రాధాన్యమిస్తామన్నారు. ముందుగా ఫోన్లు: 9866870179, 81426 57359లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

దంతెవాడ, కామ్లూరు సెక్షన్‌లో సీఆర్ఎస్ పర్యటన


ట్రాక్ పరిశీలిస్తున్న సీఆర్ఎస్‌తో డీఆర్ఎం, ఇతర అధికారులు

విశాఖపట్నం, జూన్ 29: వాల్తేరు డివిజన్ పరిధిలోని దంతెవాడ, కమ్లూరు సెక్షన్‌లో రైల్వే సేఫ్టీ కమిషనర్ (ఈస్టర్న్ సర్కిల్) సువోయోమా మిత్రా శనివారం పర్యటించారు. ఈ సెక్షన్‌లో చేపట్టిన డబ్లింగ్ లైను ని ర్మాణానికి సంబంధించి భద్రతాపరమైన సమర్థతపై సమగ్ర తనిఖీలు చేశారు. మోటారు ట్రాలీపై దంతెవాడ, కమ్లూరు స్టేషన్ల మధ్య సిగ్నలింగ్ సిస్టమ్ పనితీరును పరిశీలించారు. అనంతరం కొత్తగా నిర్మించిన కొత్త రైల్వే లైనులో ట్రయల్ రన్ నిర్వహించి కార్యచరణ నిర్వహణకు అనుమతినిచ్చారు. ఈ పర్యటనలో భాగంగా దంతెవాడ సమీపంలోని దంకిని నదిపై నిర్మించిన కొత్త వంతెనను పరిశీలించారు. అలాగే, దంతెవాడ, కిరండోల్ మధ్య జరిగిన డబ్లింగ్ ప్రాజెక్టు పనుల పురోగతిపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో డీఆర్ఎం సౌరబ్‌ప్రసాద్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాస్, ఏడీఆర్ఎం సుధీర్‌కుమార్ గుప్తా, చీఫ్ ఇంజనీర్ డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'ఏయూ వీసీకి తగిన గుణపాఠం'

అక్కయ్యపాలెం, జూన్ 29: ప్రజాస్వామ్య విలువలను తుంగలోకి తొక్కిన ఏయూ వీసీ ప్రసాదరెడ్డి తగిన గుణపాఠం జరిగిందని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ అన్నారు. ఏయూ వీసీ ప్రసాద్‌రెడ్డి అరాచకాలపై, నిరుద్యోగ సమస్యలపై ఉద్యమం చేసిన హేమంతకుమార్‌ను ఏయూ ఐక్య ఫ్రంట్ అధ్యక్షుడు ఎం.శాంతిభూషణ్ అభినందించారు. ఈ సందర్భంగా హేమంతకుమార్ మాట్లాడుతూ, ప్రస్తుత కూటమి ప్రభుత్వాన్ని ఎదుర్కోలేక ప్రసాదరెడ్డి వీసీ పదవికి ఆయన రాజీనామా చేశారన్నారు. ఆయన రాజీనామాతో బోధన, బోధనేతర సిబ్బంది ఏయూలో సంబరాలు జరుపుకొన్నారన్నారు. ఉద్యోగాలను భర్తీ చేయకుండా ఐదేళ్లపాటు కాలయాపన చేసి, ఎన్నో విలువైన కోర్సులను ఎత్తేసి విద్యార్థులకు ఆయన విద్యకు దూరం చేశారన్నారు.

నక్కవానిపాలెం గ్రామ కమిటీ ఎన్నికలు నేడు

సీతమ్మధార, జూన్ 29: గ్రేటర్ 24వ వార్డులో గల నక్కవానిపాలెంలో గ్రామ కమిటీ ఎన్ని కలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఆదివారం ఉదయం గ్రామంలో ఉన్న యువత, పెద్దలు పోటీలో పాల్గొనవారిని ఎన్నుకుంటారన్నారు. ఉదయం 7 గంటల సాయంత్రం 5 గంటల వరకు ఓటింగ్ జరుగుతుందని చెప్పారు.

ఉద్యోగ విరమణ పోలీసు సిబ్బందికి సన్మానం

మహారాణిపేట,, జూన్ 29: పోలీసు కమిషనరేట్ పరిధిలో ఉద్యోగ విరమణ చేసిన 17 మంది పోలీసు సిబ్బందిని శనివారం కమిషనర్ రవిశంకర్ సన్మానించారు. పదవీ విరమణ చేసిన ఏడీసీపీ ఎస్. వెం కటరావు, ఎస్ఐలు కాళిదాస్, జి. వెంకటరావు, ఆర్ఎస్ఐ ఎస్. బాలరామారావు, ఏఎస్ఐలు జి రాజేశ్వరరావు, ఎం సత్యారావు, వి. నాగపాపారావు, కె. సుబ్బారావు, బి. ప్రకాశరావు, ఆర్.ఆర్.కె. శర్మ, ఎం కమలాకర్‌రావు, ఏఆర్ఎస్ఐలు పి. కనకరాజు, బి. వెంకటేశ్వ రరావు, హెచ్‌సీ ఎస్. బ్రహ్మాజీరావు, ఉమెన్ హెచ్‌సీ పి. గం గమ్మ, ఏఆర్ హెచ్‌సీలు ఎం. బలరామ్, పీఎస్ సూర్యనారాయణలను సన్మానించారు. పోలీసు కమిషనరేట్‌కు వారి కుటుంబ సభ్యులను ఆహ్వానించి అధికారులు సమక్షంలో సత్కరించి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు వృద్ధిలోకి రావాలి

» ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు


పుస్తకాలు అందిస్తున్న ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్

మురళీనగర్, జూన్ 29 ; ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను చిన్నారులు సద్వినియోగం చేసుకుని వృద్ధిలోకి రావాలని విశాఖ నార్త్ నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ అన్నారు. గ్రేటర్ 50వవార్డులోని మాధవధార జీవీఎంసీ హైస్కూలులో శనివారం విద్యార్థులకు కిట్స్ అందజేసారు. హెచ్‌ఎం బి.హేమలత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై స్కూలు యూనిఫారం, టెక్స్ బుక్స్, షూస్, బాగ్ ఇతరత్రా సామగ్రి కలిగిన కిట్‌లను బాలలకు అందించారు. కార్యక్రమంలో ఎంఈవో సోమేష్, వార్డు టీడీపీ అధ్యక్షులు ననపల.వరప్రసాద్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే చిన్నారులకు భవిత


బడికి పోతా.. అవగాహన ర్యాలీలో అధికారులు

సీతమ్మధార, జూన్ 29: గ్రేటర్ 25వ వార్డు మధురానగర్ జీవీఎంసీ పాఠశాల పరిసర ప్రాంతాల్లో నేను బడికి పోతా.. పేరిట అవగాహన ర్యాలీని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మధురానగర్, శాంతిపురం, సీతంపేట, రాజేంద్రనగర్ పరిసర ప్రాంతాల్లో ఏఎస్‌వో గీత, ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ బి.శ్రీనివాస్, ఏపీవో అప్పలనాయుడు, సీతమ్మధార మండల విద్యాశాఖాధికారులు డి.రామారావు, బాలామణి పర్యటించారు. బడి బయట ఉన్న నలుగురు విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మౌలిక వసతులు, మధ్యాహ్న భోజన పథకం, ఆరోగ్య పరీక్షలు, స్టూడెంట్ కిట్స్, విద్యా ప్రమాణాలను వివరించి విద్యార్థులను బడిలో చేర్పించారు.

సిద్ధమమవుతున్న అన్న క్యాంటీన్లు

... 5వ పేజీ తరువాయి

ఏ సమయానికి ఎంతమంది భోజనం చేస్తున్నారనేది తెలుసుకునేందుకు వీలుగా ఇంటర్‌నెట్ సదుపాయం కల్పించి, అమరావతిలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశారు. ఉదయం అల్పాహారం,మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం ఏదైనా రూ.5కే అంద జే యడంతో 25చోట్ల కలిపి ప్రతిరోజూ సగటున పది వేల మంది అల్పాహారం, 15 వేల మంది వరకూ మధ్యాహ్నం భోజనం, పది వేల మంది వరకూ రాత్రి భోజనం చేసేవారు. అయితే 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో అన్న క్యాంటీన్లు మూతపడ్డాయి. ఇటీవలజరిగిన ఎన్నికల్లో కూటమి తిరిగి అధికారంలోకి రావడంతో అన్నక్యాంటీన్లనుఅందుబాటులోకితీసుకువచ్చేందుకు సిద్ధమైంది. జీవీఎం సీ పరిధి సెప్టెంబరు నుంచి అన్న క్యాంటీన్లు అందుబాటులోకి రాబోతున్నాయని తెలిసి పేదలు, సామాన్యులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

ఏయూకు పూర్వ వైభవం తీసుకువస్తాం

» రాజకీయాలకు అతీతంగా వర్సిటీలో పాలన
» సీఎం రమేష్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి, వంశీకృష్ణ
» వీసీ ప్రసాదరెడ్డి నిష్క్రమణతో వర్సిటీలో సంబరాలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్, (చిత్రంలో) ఎంపీ సీఎం రమేష్, వెలగపూడి, వంశీకృష్ణ తదితరులు

విశాఖపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా యూనివర్సిటీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం ఉదయం ఏయూలోని వీసీ కార్యాలయం ఎదుట కూటమి నేతలు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ సీఎం రమేష్ మాట్లాడుతూ ఏయూలో తాము ఈ కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసే ప్రసాదరెడ్డి రాజీనామా చేశాడన్నారు. రాజీనామా చేసినా, ఆయన చేసిన అక్రమాలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వర్సిటీలో పనిచేసే సిబ్బందిని, విద్యార్థులను గత ఐదేళ్లలో ప్రసాదరెడ్డి తీవ్రఇబ్బందులకు గురిచేశారని, ఇకపై వారంతా స్వేచ్ఛగా పనిచేసుకోవచ్చన్నారు. ప్రసాదరెడ్డి చేసిన ప్రతి ఒక్కదానికీ లెక్క తేలుస్తామన్నారు. విద్యా సంస్థల్లో రాజకీయ నేతల విగ్రహాలు పెట్టాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. ఏయూలో దాదాపు రూ.100 రూ సా నిధులను దుర్వినియోగం చేశారని ఆయన ఆరోపించారు. గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రసాదరెడ్డి అక్రమాలపై గవర్నర్, సీఎంకు ఫిర్యాదు చేసి న్యాయ విచారణ చేయి స్తామన్నారు. సీఎం చంద్రబాబు, వి ద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో రాజకీ యాలకతీతంగా వర్సిటీలో పాలన సాగించేలా కృషి చేస్తామన్నారు.ఎమ్మెల్యే వెలగపూడి మాట్లాడుతూ ప్రసాదరెడ్డి వల్ల ఇబ్బందులకు గురైన ఉద్యోగులకు న్యాయం చేస్తామన్నారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ వీసీ దుర్మార్గ పాలన తొలగిందన్నారు.

వినతుల వెల్లువ..

వీసీ ప్రసాదరెడ్డి హయాంలో ఇబ్బందులకు గురైన పలువురు ఉద్యోగులు, విద్యార్థి సంఘ నాయకులు నేతలకు వినతులిచ్చారు. గెస్ట్ ఫ్యాకల్టీ తమను మళ్లీ తీసుకోవాలంటూ మీనన్ ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులు కోరారు. తనకు జరిగిన అన్యాయాన్ని పొన్నాడ శ్రీనివాసరావు వివరించారు. వందలాదిమంది వీసీ కార్యాలయం వద్దకు చేరుకుని బాణసంచా కాల్చిసంబరాలు చేసుకున్నారు. టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్ ఆధ్వర్యంలో మొత్తం గేట్లు తీయించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులుఆరేటి మహేష్‌ప్రొఫెసర్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు పాతర, అక్రమాల జాతర

... 5వ పేజీ తరువాయి

సెక్యూరిటీ సిబ్బందికి మాత్రం అలవెన్సులతో కలిపి సుమారు రూ.20 వేలకుపైగా ఇస్తున్నారు. సెక్యూరిటీ సిబ్బందిగా నియామకం సమయంలో ఖాన్‌కు వారంతా భారీగానే సమర్పించుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే, ఖాన్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా నియమితులైన తరువాత ట్రాన్స్‌పోర్ట్ డీన్‌గా కూడా వీసీ అవకాశం కల్పించారు. ఈ బాధ్యతలను ఖాన్ 'చక్కగా' వినియోగించుకున్నట్టు చెబుతున్నారు. ఏయూ వాహనాలకు ఆయిల్, ఇతర మరమ్మతులు నిర్వహణ పేరుతో నిధులు దుర్వినియోగం చేశారంటున్నారు. పూర్తిగా మూలకు చేరిన వాహనాలను విక్రయించుకున్నారని... ఆయన తీసుకున్న నిర్ణయాలపైనా విచారణ చేయాల్సిందిగా పలువురు కోరుతున్నారు.

రాజీనామా ఇంకెప్పుడు..?

పదవీ విరమణ తరువాత వివిధ బాధ్యతల్లో చేరిన అధికారులు అందరూ ఇప్పటికే రాజీనామా చేశారు. ఆఖరికి వీసీ, రిజిస్ట్రార్ కూడా పోస్టులు నుంచి తప్పుకున్నారు. కానీ, ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్ మాత్రం ఇంకా రాజీనామా చేయలేదు. ఇదే ఇప్పుడు వర్సిటీలో చర్చనీయాంశంగా మారింది. ఏడాదిన్నర కిందట పదవీ విరమణ చేసిన ఆయనకు మళ్లీ ప్రిన్సిపాల్‌గా ప్రసాదరెడ్డి అవకాశం ఇచ్చారు. అయన ఇప్పటికీ కొనసాగుతుండడం గమనార్హం.

దాతల ఇచ్చిన నిధుల లెక్క..?

గడిచిన ఐదేళ్లలో ఎన్నడూ లేని విధంగా యూనివర్సిటీ అధికారులు దాతల నుంచి భారీగా నిధులు సేకరించారు. కొందరు సొంత నిధులతో భవనాలు కట్టించగా, మరికొందరు వర్సిటీ అభివృద్ధికి వినియోగించాలంటూ నిధులు అందించారు. ఈ నిధులను ఏ ఖాతాలో జమ చేశారన్న దానిపై వర్సిటీ అధికారులకు సమాచారం లేకపోవడం గమనార్హం. వీటి వినియోగంపైనా దృష్టిసారిస్తామని కూటమి నేతలు శనివారం ప్రకటించారు.

ప్రక్షాళన చేయాల్సిందే!!

... 5వ పేజీ తరువాయి

చైర్ ప్రొఫెసర్లు తమతో సమానంగా రిజిస్టర్లలో సంతకాలు పెడితే ఊరుకోబోమని రెగ్యులర్ ప్రొఫెసర్లు అంటున్నారు. వారికి ప్రత్యేకంగా ఒక రిజిస్టర్ పెట్టుకోవాలని సూచిస్తున్నారు. అదేవిధంగా పలు విభాగాల్లో సీనియర్లు, సమర్థులు అనేక మంది ఉండగా వారిని కాదని, రిటైరైన వారికి, జూనియర్లకు కీలక బాధ్యతలు అప్పగించారు. ఈ నిర్ణయాలన్నింటినీ సమీక్షించి, అర్హత కలిగిన వారికి అవకాశం కల్పించాల్సి ఉంది. ప్రసాదరెడ్డి కంప్యూటర్స్ విభాగం ప్రొఫెసర్. ఆ విభాగంలోనే సీనియర్లకు అన్యాయం చేశారు. అక్కడి నుంచే ప్రక్షాళన ప్రారంభించాలనే డిమాండ్ వినిపిస్తోంది.

స్టీల్ ప్లాంటుపై ఎన్నాళ్లీ ఆర్థిక భారం?

... 5వ పేజీ తరువాయి

70 మంది బోధన, బోధనేతర సిబ్బంది ఉన్నారు. ప్రిన్సిపాల్‌కు నెలకు రూ.70 వేల జీతం. సీనియర్ టీచర్లకు రూ.50 వేలు. సీనియర్ బోధనేతర సిబ్బందికి రూ.35 వేలు. వీరు కాకుండా అవుట్‌సోర్సింగ్‌లో మరో 20 మంది టీచర్లు ఉన్నారు. వారికి రూ.15 వేలు ఇస్తున్నారు. జీతాలకు నెలకు రూ.35 లక్షలు ఖర్చు అవుతోంది. స్టీల్‌ప్లాంటు ఐదేళ్లకొకసారి ఎంఓయూ చేసుకుని రూ.7 కోట్లు ఇస్తోంది. తమ ఆర్థిక స్థితి బాగా లేనందున ఇకపై సాయం చేయలేమని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని గత నెలలో తెగేసి చెప్పింది. ఆ మేరకు ఏర్పాట్లు చూసుకోకుండా డయసిస్ యాజమాన్యం పూర్తిగా విద్యాలయాన్నే మూసివేసేందుకు సిద్ధమైంది. విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగడంతో ప్రస్తుతానికి తరగతులు నిర్వహిస్తోంది.

కోర్టుకు వెళ్లి ఆదేశాలు

విద్యాలయాన్ని నిర్వహించేది కేంద్ర ప్రభుత్వానికి చెందిన స్టీల్‌ప్లాంటు. నిబంధనలు కూడా అవే వర్తిస్తాయి. ఆ మేరకు 60 ఏళ్లకు విద్యాలయంలో టీచర్లకు రిటైర్‌మెంట్ ఇవ్వాలి. అలా చేస్తే కొందరు కోర్టుకు వెళ్లి, రాష్ట్ర ప్రభుత్వం 62 ఏళ్లు చేసిందని, తమకూ వర్తిస్తుందంటూ ఆదేశాలు తెచ్చుకున్నారు. ఇలా ఓ పది మంది వరకు కొనసాగుతున్నారు. దీనిని స్టీల్ యాజమాన్యం అంగీకరించడం లేదు.

సరిగ్గా వ్యవహరించని డయసిస్

విద్యాలయ నిర్వహణ బాధ్యత తీసుకున్న డయసిస్ సరిగ్గా వ్యవహరించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఆరోపణలు వస్తున్నా ఆదాయ వ్యయాల వివరాలు వెల్లడించకపోవడం వంటివి అనుమానాలకు తావిస్తున్నాయి.

స్థాయీ సంఘాల్లోకి నూతన ఎమ్మెల్యేలు

... 5వ పేజీ తరువాయి

అనకాపల్లి జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారిని ఆదేశించారు.

అలిగిన జడ్పీటీసీ సభ్యుడు

ఆరో స్థాయీ సంఘ చైర్‌పర్సన్‌గా ఉన్న రావికమతం జడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో ఆమె స్థానంలో తొలుత మునగపాక జడ్పీటీసీ సభ్యుడు సత్యనారాయణను తాత్కాలికంగా నియమించి ఆ సమాచారాన్ని ఆయనకు ఇచ్చారు. అయితే ఆ తరువాత మహిళ మాత్రమే చైర్‌పర్సన్‌గా ఉండాలన్న నిబంధన మేరకు నాతవరం జడ్పీటీసీ సభ్యురాలు అప్పలనర్సను నియమించారు. శనివారం ఆమె అధ్యక్షతన స్థాయీ సంఘ సమావేశం జరుగుతున్నప్పుడు మునగపాక జడ్పీటీసీ సభ్యుడు హాజరయ్యారు. చైర్‌పర్సన్‌గా తనను మార్చిన విషయం ముందుగా ఎందుకు చెప్పలేదంటూ అలిగి బయటకు వెళ్లిపోబోగా మిగిలిన సభ్యులు నచ్చజెప్పారు. కాగా అరకు ఎమ్మెల్యేగా ఎన్నికైన హుకుంపేట జడ్పీటీసీ సభ్యుడు మత్స్యలింగంను చైర్‌పర్సన్ సుభద్ర, సీఈవో పోలినాయుడు, డిప్యూటీ సీఈవో సత్యనారాయణ, సభ్యులు సత్కరించారు.

'పోషకాహారానికి ప్రాధాన్యమివ్వాలి'

డాబాగార్డెన్స్, జూన్ 29: రాత్రి వేళ తీసుకునే ఆహారంలో పోషకాలు కలిగి ఉండేలా ప్రాధాన్యం ఇవ్వాలని ప్రముఖ వైద్యులు రోహిణి పాటిల్ తెలిపారు. శనివారం సాయంత్రం డాబాగార్డెన్స్‌లోని ఓ హాల్‌లో 'ఆహారం - ఆరోగ్యం' అనే అంశంపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాత్రి వేళ కాటేజీ చీజ్, బాదం, గ్రీక్‌యోగర్ట్, కివి పండ్లు, చెర్రీ, టమాటాలు, హార్డ్ బాయిల్డ్ గుడ్లను ఆహారం తీసుకోవడం చాలా మంచిదన్నారు.

అప్పన్నకు వైభవంగా సహస్రనామ తులసీ దళార్చన

సింహాచలం, జూన్ 29 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా శనివారం సహస్రనామ తులసీ దళార్చన వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని భూదేవి, నీలాదేవి సమేతంగా స్వర్ణాభరణాలతో, పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో అర్చకులు సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ సహస్ర నామావళి పఠిస్తూ ప్రతి నామానికి ఒక్కొక్క తులసీ దళంతో అర్చన చేశారు. తరువాత పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు అందించారు.

తగ్గుతున్న టమాటా ధర

ఎంవీపీ కాలనీ, జూన్ 29 : కొండెక్కిన టమాటా ధర దిగుతోంది. రూ. 80 వరకు వెళ్లిన ధర రైతు బజారులో శనివారం రూ.42 లకు తగ్గింది. శుక్రవారం కూడా ఈ ధర ఉండాల్సి ఉండగా మార్కెటింగ్ శాఖ అప్పటికే మదనపల్లిలో టమాటా కొనుగోలు చేయడంతో రూ.46లకు విక్రయించారు. ధర తగ్గడంతో ఒక్క రోజుతోనే టమాటా తరలింపును మార్కెటింగ్ శాఖ నిలిపివేసింది. ఈ ధర మరింతగా తగ్గే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

ఆరిలోవలో 'విద్యా ప్రవేశం' ర్యాలీ

ఆరిలోవ, జూన్ 29 : తల్లిదండ్రులు ఐదేళ్లు దాటిన పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని ఎంఈఓ -1 సీహెచ్ రవీంద్రబాబు కోరారు. శనివారం ఆరిలోవ కాలనీలో స్థానిక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు విద్యా ప్రవేశం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు ఉన్నాయని, పిల్లలకు పుస్తకాలతో పాటు బ్యాగులు, యూనిఫారం ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉమామహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

నేడు సత్యసాయి సేవా సమితి వార్షికోత్సవం

భీమునిపట్నం, జూన్ 29 : పట్టణంలోని సత్యసాయి సేవా సమితి 22వ వార్షికోత్సవం ఆదివారం జరగనున్నట్టు సమితి సభ్యులు తెలిపారు. శనివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 4.45 నిమిషాలకు 21 సార్లు ఓంకారం, సుప్రభాతంతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. అయిదు గంటలకు నగర సంకీర్తన, 6గంటలకు పాలాభిషేకం, అష్టోత్తర శతనామావళి,పతాకావిష్కరణ జరుగుతాయని చెప్పారు. ఉదయం 9 నుంచి బాబా సామూహిక వ్రతాలు, సాయంత్రం అయిదున్నరకు బాలవికాస్ బాలలతో సాంస్కృతిక కార్యక్రమాలు, అతిథుల ప్రసంగాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

కల్వర్టుకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆరిలోవ, జూలై 29 : జీవీఎంసీ 12వ వార్డు సాలిపేట కొండవాలు ప్రాంతంలో ఉన్న ఈశ్వరదేవీ నగర్‌లో కల్వర్టుకు జీవీఎంసీ అధికారులు ఎట్టకేలకు మరమ్మతు చేశారు. ఇక్కడ కల్వర్టు పలక విరిగి ఉండడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఈమేరకు కల్వర్టు పలకకు మరమ్మతులు చేపట్టి, సరిచేశారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఎంవీపీ కాలనీ, జూన్ 29 : మహిళలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని కేజీహెచ్ వైద్య నిపుణురాలు లక్ష్మీ తులసి అన్నారు. ఎంవీపీ కాలనీలోని వాసవానిపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో శనివారం భారత్ వికాస్ పరిషత్ ప్రతినిధులు నిర్వహించిన ఎనిమియా ముక్త భారత్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. భారత్ వికాస్ పరిషత్ జాతీయ ప్రతినిధి రమేష్ చంద్ జైన్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం బీవీపీ సంస్థ మహిళలకు పౌష్టికాహారం, విటమిన్ మాత్రలు,విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సత్యవేణి, పరిషత్ ప్రతినిధులు సత్యనారాయణ, భాస్కరరావు, షర్మిల, రాజశేఖర్ పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **మహరాజ :** మెలోడీ, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), తాతా సీతారామయ్య (పరవాడ), (తగరపువలస)
- **ప్రభుత్వ జూనియర్ కళాశాల :** రమాదేవి, వెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక),
- **మనమే :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **హరోం హర :** శ్రీరామ, శారద, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక)
- **హనీమూన్ ఎక్స్‌ప్రెస్ :** రమాదేవి, శ్రీనరసింహ (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
- **ఓఎంజీ :** శ్రీవెంకటేశ్వర, సంగం, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **భజే వాయు వేగం :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 35, టమాటా 42, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 24, పచ్చిమిర్చి 88, కాకరకాయలు 48, బీరకాయలు 42, ఆనపకాయలు 18, కాలీఫ్లవర్ 40, క్యాబేజ్ 30, క్యారేట్ 38, దొండకాయలు 26, బంగాళా దుంపలు 32, అరటి కాయ (పె)6, మునక్కాడలు (కిలో) 105, అల్లం (పాతది) 150, బరబటి 60, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 38, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 126, పొటల్స్ 32, కీరదోస 32, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 36, కంద 60, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	120
ఫారం ధర	--	140
విత్ స్కిన్	--	250
స్కిన్‌లెస్	--	260

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 12 లో..

ఇలా వస్తారు.. అలా వెళ్తారు

- సమయపాలన పాటించని సచివాలయ ఉద్యోగులు
- ఇష్టారాజ్యంగా విధులకు..
- కార్యాలయాల వద్ద ప్రజల పడిగాపులు
- అధికారుల పర్యవేక్షణ లోపమే కారణం


మద్ది సచివాలయంలో శనివారం మధ్యాహ్నం 12 గంటలకు ఖాళీగా ఉన్న కుర్చీ

పద్మనాభం (రూరల్), జూన్ 29 : గ్రామ సచివాలయాల్లో సిబ్బంది విధులకు సక్రమంగా హాజరు కావడం లేదు. దీంతో వివిధ పనుల కోసం కార్యాలయాలకు వస్తున్న వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజల వద్దకు సేవలను చేరువ చేయాలని సచివాలయాలు ఏర్పాటు చేశారు. అన్ని విభాగాలకు సిబ్బందిని నియమించారు. అయితే ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం వల్ల వారు సరిగ్గా సమయపాలన పాటించడం లేదు. కొందరు ఎప్పుడు వస్తారో, ఎక్కడకు వెళుతున్నారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రజలు ధ్రువీకరణ పత్రాల కోసం,విద్యుత్ బిల్లుల చెల్లింపు తదితర వాటికి కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. మండలంలోని 22 పంచాయతీల్లో 16 సచివాలయాల్లో సుమారు 60 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వారంతా ఇప్పటివరకు తమ పనిభారాన్ని వలంటీర్లపై మోపారు. ప్రస్తుతం వలంటీర్లు లేకపోవడంతో ప్రజలకు సమాచారం ఇచ్చేందుకు కూడా సిబ్బంది అందుబాటులో ఉండడం లేదు. కొన్నిచోట్ల ఏదో ఒక సమయంలో రావడం హాజరు నమోదు చేసుకుని వెళ్లిపోవడం, తిరిగి సాయంత్రం కనిపించి వెనుదిరగడం పరిపాటిగా మారింది. ఇంతగా వ్యవస్థ గాడి తప్పినా.. అధికారులు పట్టనట్టు చోద్యం చూస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

బీఆర్ తాళ్లవలసలో విధులకు డుమ్మా

పద్మనాభం : మండలంలోని బీఆర్ తాళ్లవలసలో సచివాలయ ఉద్యోగులు కార్యాలయానికి డుమ్మా కొడుతున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు కె. రమణ ఆరోపించారు. శనివారం ఆయన గ్రామంలోని సచివాలయాన్ని సందర్శించారు. ఆ సమయంలో కేవలం పంచాయతీ కార్యదర్శితో పాటు నలుగురు మాత్రమే ఉన్నారు. ఈ సందర్భంగా రమణ విలేకరులతో మాట్లాడుతూ సిబ్బంది పనితీరు బాగోలేదని, ఎవరూ సమయానికి రావడం లేదని చెప్పారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా వీఆర్వో, సర్వే సహాయకులు, పశుసంవర్ధక సహాయకులు, లైన్‌మేన్ విధులకు రాలేదన్నారు. తనకు కూడా సమాచారం ఇవ్వలేదని చెప్పారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శైలజ

ఫిర్యాదులు వస్తున్నాయ్ : ఎంపీడీఓ

సచివాలయ ఉద్యోగులు విధులకు గైర్హాజరయితే చర్యలు తప్పవని ఎంపీడీఓ శైలజ హెచ్చరించారు. శనివారం ఆమె తన కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు విధులకు రావడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. మరోసారి ఆరోపణలు వస్తే సహించేది లేదన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు ఆన్‌లైన్ హాజరు లేని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యదర్శులు కూడా సమయానికి హాజరై సిబ్బంది హాజరును పర్యవేక్షించాలన్నారు. సోమవారం ఇంటికి వెళ్లి సామాజిక పింఛన్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఈఓఆర్డీ కుమార్, ఏఓ రాధ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జూట్‌మిల్లు కార్మిక నాయకులతో గంటా భేటి


కార్మిక సంఘాల నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

తగరపువలస, జూన్ 29 : చిట్టివలస జూట్‌మిల్లు కార్మికుల సమస్యల పరిష్కారానికి మిల్లు యజమాని కేకే బజోరియాను కోల్‌కత్తా నుంచి నగరానికి రప్పిస్తామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. శనివారం రాత్రి ఆయన నగరంలోని తన నివాసంలో కార్మిక సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏయే సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్న విషయాన్ని నాయకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గంటా మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. మిల్లు యజమానిని రప్పించి అతనికి ఉన్న సమస్యలను తెలుసుకుని కార్మికులకు రావల్సిన పరిహారాలు అందించడానికి ప్రయత్నిస్తామని చెప్పారు. ఈమేరకు మిల్లు యజమానికి నోటీసు అందజేస్తామని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు సమస్యను పరిష్కరించకుండా కాలయాపన చేసిందని విమర్శించారు. ఈ సమావేశంలో తగరపువలసకు చెందిన టీడీపీ నాయకులతో పాటు ఏఐటీయూసీ నాయకులు కొండపు ఈశ్వరరావు, అల్లు బాబూరావు, చిల్ల అప్పలస్వామి, టీఎన్‌టీయూసీ నాయకులు త్రిమూర్తులు, అచ్చారావు, నరవ రామారావు, కాంగ్రెస్ కార్మిక సంఘం నాయకులు అప్పలరెడ్డి, ఆదినారాయణ, ఈశ్వరరావు, కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డు హెచ్‌ఎంకు సన్మానం

పద్మనాభం, జూన్ 29 : మండలంలోని రెడ్డిపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా పని చేసిన నెమలిపురి జగదీష్ రిటైర్డ్ కావడంతో ఉపాధ్యాయులు శనివారం ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఎంఈఓ పి. రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజేశ్వరి, ఉప సర్పంచ్ ఆదిబాబు, రెడ్డిపల్లి జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సన్యాసిరావు, ఎస్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి జగదీష్‌బాబు, ఆపస్ జిల్లా అధ్యక్షుడు అరుణ్‌కుమార్, ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు పద్దరాజు, యూటీఎఫ్ నాయకుడు సన్యాసిరావు, పీఆర్‌టీయూ నాయకుడు రామారావు పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బుడ్డెపు శ్రీనివాసరావు రిటైర్ కావడంతో ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు శ్రీనివాసరావు పాఠశాల అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం మాజీ డైరెక్టర్ చందక సూరిబాబు, ఎంపీ టీసీ సభ్యుడు కొట్యాడ రెడ్డిబాబు, ఉపాధ్యాయులు కెజియా, భాస్కరరావు, సత్యన్నారాయణ, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిపల్లిలో నేత్ర వైద్య శిబిరం



రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

పద్మనాభం, జూన్ 29 : మండలంలోని రెడ్డిపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో శంకర్ ఫౌండేషన్ నేత్ర వైద్య శాల ఆధ్వర్యంలో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు 70 మందికి పరీక్షలు చేసి, 30 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. వారితో పాటు కంటి నరాల చికిత్సకు ఇద్దరిని, నేత్ర నీటి కాసుల చికిత్స కోసం ఇద్దరు, కంటి పైపొరల చికిత్స కోసం, చిన్న పిల్లల నేత్ర చికిత్స కోసం ఒక్కొక్కరిని గుర్తించారు. వారిని శంకర్ ఫౌండేషన్ నేత్ర వైద్య శాలకు పంపించడానికి వైద్యులు సిఫారసు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె. దామోదరరావు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు పీవీ రమణ, ఇతర నాయకులు శ్రీనివాసరావు, వెంకటరమణ, శంకర్ ఫౌండేషన్ వైద్యులు జాక్సన్, క్యాంపు కోఆర్డినేటరు రాజు, ప్రసాద్, నర్సింగ్ సిబ్బంది శిరీష పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ ఉచిత శిక్షణ

ఎంవీపీ కాలనీ, జూన్ 29 : డీఎస్సీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు ఏపీ బీసీ స్టడీ సర్కిల్ ఇన్‌చార్జి డైరెక్టర్ శ్రీదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు వచ్చే నెల 8వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. 200 మంది అభ్యర్థులకు రెండు నెలలు పాటు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్ రూ. 3 వేలు, రూ. వెయ్యి విలువైన స్టడీ మెటీరియల్ అందిస్తామని తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తుతో పాటు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కుల జాబితా, టీటీసీ, టెట్‌లో అర్హత సాధించిన మార్కుల జాబితా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు (తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. లక్షలోపు మాత్రమే),ఆధార్, బ్యాంకు పాస్ బుక్ జెరాక్స్, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలను జత చేసి, బీసీ స్టడీ సర్కిల్, ఎంవీపీ కాలనీ, విశాఖపట్నం అన్న చిరునామాకు నేరుగా పంపించాలని కోరారు. పూర్తి వివరాలకు 94925 69177 నంబరును సంప్రతించాలని ఆమె సూచించారు.

'పింఛన్ల పంపిణీలో జాప్యం వద్దు'

ఆరిలోవ, జూలై 29 : జీవీఎంసీ 9వ వార్డు పరిధిలో ఉన్న అన్ని సచివాలయాల సిబ్బంది పింఛన్ల పంపిణీలో జాప్యం లేకుండా చూడాలని ఆ వార్డు టీడీపీ ఇన్‌చార్జి బుడుమూరు గోవింద్ కోరారు. శనివారం ఆయన వార్డులోని పార్టీ కార్యాలయంలో సచివాలయాల ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 6 గంటల నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభం కావాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు బాదరు బాలరాజు, బుడుమూరు భూలక్ష్మి, భారతి, తదితరులు పాల్గొన్నారు.

రూ 1.27 కోట్లకు వేములవలస మార్కెట్ వేలం ఖరారు

ఆనందపురం, జూన్ 29 : మండలంలోని వేములవలస మహాత్మాగాంధీ పువ్వులు, కూరగాయల మార్కెట్‌కు శనివారం వేలం పాట నిర్వహించారు. రూ. 1.27 కోట్లలకు పాట ఖరారైంది. జిల్లా పంచాయతీ అధికారి ఎంవీఏ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 01-07-2024 నుంచి 31-03-2025 వరకు మార్కెట్ వేలం నిర్వహించగా షీల్డు కవరు వేలంలో నలుగురు, బహిరంగ వేలంలో ముగ్గురు పాల్గొన్నారు. బహిరంగ వేలంలో వేములవలస గ్రామానికి చెందిన కోరాడ శ్రీను 1.07 కోట్ల రూపాయలకు పాడగా అదే గ్రామానికి చెందిన కోరాడ మహేష్ 1.08 కోట్ల రూపాయలకు పాడారు. అనంతరం షీల్డు కవరు టెండర్లు ఓపెన్ చేయగా వేములవలస గ్రామానికి చెందిన ఎన్ని శంకర్రావు 1.27 కోట్ల రూపాయలకు కోట్ చేశారు. దీంతో అత్యధికంగా నమోదు చేసిన ఎన్ని శంకర్రావుకు పాటను ఖరారు చేశారు. గత ఏడాది రూ. 1.54 కోట్లకు పాట ఖరారు కాగా ఈసారి 9 నెలలకు రూ. 1.27 కోట్లకు పాట పాడారు.ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రామారావు, సర్పంచ్ లంక కొండమ్మ, ఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్, పంచాయతీ అధికారి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.


అయ్యన్నపాత్రుడుకి పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

స్పీకర్ అయ్యన్నను కలిసిన క్షయ విభాగం ఉద్యోగులు

మధురవాడ, జూన్ 29 : ప్రభుత్వ ఆస్పత్రుల్లో క్షయ నివారణ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుకి శనివారం వినతిపత్రం అందించారు. ఈమేరకు ఆ సంఘం నాయకులు నగరంలోని దసపల్లా హోటల్‌లో అయ్యన్నను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో ఏళ్ల తరబడి కాంట్రాక్టు ఉద్యోగులుగా పని చేస్తున్నామని, ప్రతి నెలా సక్రమంగా వేతనాలు అందడం లేదని, సమాన పనికి సమాన వేతనం లభించడం లేదని తెలిపారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఎంవీవీ గోపీనాథ్, సునీత, మణి, వీరబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి లలిత త్రిపుర సుందరీదేవి ఆలయ వార్షికోత్సవం


ఎమ్మెల్యే గంటాకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న బొడ్డేపల్లి సురేష్

మధురవాడ, జూన్ 29 : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని మానం ఆంజనేయనగర్‌లో ఉన్న లలిత సుందరీ సమేత మహా కామేశ్వరస్వామి దేవాలయం పంచమ వార్షికోత్సవాలు ఆదివారం నుంచి జరగనున్నట్టు ఆలయ ధర్మకర్త బొడ్డేపల్లి సురేష్ తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదివారం ఉదయం మహా గణపతి పూజ, పుణ్యాహవచనంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. సోమవారం ఉదయం 6 నుంచి దేవతలకు షోడశ ఉపచార పూజలు, మహాకామేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు, కుంకుమార్చనలు, రుద్ర హోమం, నీరాజనం, మంత్ర పుష్పం తదితర పూజలు చేస్తారన్నారు. మంగళవారం మండప ఉద్వాసన, పూర్ణాహుతి, మహా అన్నదానం ఉంటుందని చెప్పారు. సాయంత్రం 5 గంటలకు మహిళల కోలాటం, ఉత్సవమూర్తుల ఊరేగింపుతో పాటు పల్లకీ సేవ, పంచహారతి, నక్షత్ర హారతి పూజలు ఉంటాయన్నారు. ఉత్సవాలకు ముఖ్య అతిథిగా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును ఆహ్వానించినట్టు ఆయన చెప్పారు.

ఒడిశా భక్తులకు దాసుడు నూనె పంపిణీ


భక్తులకు నూనె పంపిణీ చేస్తున్న దాసుడు

సింహాచలం, జూన్ 30 : ఒడిశాలోని బరంపురం జిల్లా పట్టుపురం గ్రామానికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త లక్ష్మీకాంత్ నాయకోదాసుడు తన శిష్య బృందానికి శనివారం నూనె పంపిణీ చేశారు. దాసుడు వెంట వచ్చిన వందలాది మంది శిష్యులకు ఆయన స్వామివారి దర్శనం తరువాత తులసీ దళాలు ఇచ్చి నుదుటన కుంకుమ బొట్టు పెట్టారు. అనంతరం కల్యాణ మండపంలోని అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక దీపారాధన చేసి ఆ ప్రమిదలోని నూనెను ఒడిశా భక్తులకు పంపిణీ చేశారు. వారంతా దాసుడు ఇచ్చిన నూనెను తలకు, శరీరానికి రాసుకున్నారు. దీనివల్ల తమకున్న శారీరక సమస్యలు తొలగిపోతాయన్నది వారి విశ్వాసం.

అనాథ యువతికి స్వచ్ఛంద సంస్థల సాయం


యువతిని ఆస్పత్రికి తీసుకువెళుతున్న యువకులు

భీమునిపట్నం, జూన్ 29 : పట్టణానికి శివారు ప్రాంతమైన నేరేళ్లవలస కాలనీ ఆఖరున ఒక అసంపూర్తి భవనంలో అనారోగ్యంతో పడివున్న అనాథ యువతిని ఓఎస్‌జీ ఫౌండేషన్, ఏఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ సభ్యులు ఆదుకుని కేజీహెచ్‌కు తరలించారు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. 30 ఏళ్ల క్రితం పట్టణానికి ఓ తల్లీ కూతురు బతుకు తెరువు కోసం వచ్చారు. వారు చిన్నబజారులో అద్దె ఇంట్లో నివసించేవారు. 2000లో తల్లి అనారోగ్యంతో మృతి చెందడంతో అప్పటి నుంచి యువతి నగరంలో చిన్న చిన్న పనులు చేసుకుని ఒంటరిగా జీవించేది. కాలక్రమేణా ఆమె మతిస్థిమితం కోల్పోయింది. వారం రోజులుగా ఆమె ఏమీ తినకపోవడంతో తీవ్ర అనారోగ్యంతో లేవలేని స్థితికి చేరుకుంది.ఈ విషయాన్ని కాలనీవాసులు స్వచ్ఛంద సంస్థలకు సమాచారం ఇవ్వడంతో వారు శనివారం ఆమెను ఆటోలో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లగా వైద్యులు పరీక్షించారు. ఆమెకు గుండె, కిడ్నీ సంబంధిత సమస్యలు ఉండడంతో కేజీహెచ్‌కు తరలించారు.

లోక్ అదాలత్‌లో 204 కేసులు పరిష్కారం


జడ్జి సౌజన్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లోక్ అదాలత్

భీమునిపట్నం, జూన్ 29 : పట్టణంలోని ప్రిన్సిపల్ జూనియరు సివిల్ జడ్జి కోర్టు, ఒకటవ, రెండవ అదనపు జూనియరు సివిల్ జడ్జి కోర్టుల్లో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 204 కేసులను పరిష్కరించారు. ప్రిన్సిపల్ జూనియరు సివిల్ జడ్జి పి. నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 135 కేసులు, 1, 2వ అదనపు జూనియరు సివిల్ జడ్జి డి. సౌజన్య ఆధ్వర్యంలో 69 కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోక్ అదాలత్‌ల ద్వారా బాధితులకు సత్వర న్యాయం లభిస్తుందన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ మెంబర్ దత్తి ఈశ్వరరావు, ఏపీపీ రవి, బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పార్వతీశం, సుధాకర్, పాత్రుడు, సీనియరు న్యాయవాదులు సుందర్‌సింగ్, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీలో 78 మంది ఉద్యోగుల పదవీ విరమణ


ఉద్యోగిని సన్మానిస్తున్న ఉన్నతాధికారులు

వెంకోజీపాలెం, జూన్ 29 : జీవీఎంసీలో 78 మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందారని అదనపు కమిషనర్ డాక్టర్ వై. శ్రీనివాసరావు అన్నారు. శనివారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్లు ఎస్.ఎస్.వర్మ డాక్టర్ వి. సన్యాసిరావు, ప్రధాన ఇంజనీరు పి. రవికృష్ణంరాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్ రిటైర్డ్ ఉద్యోగులను సన్మానించారు. ఈ సందర్భంగా ఏడీసీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగులు విధి నిర్వహణలో భాగంగా ప్రజలకు ప్రభుత్వానికి ఎన్నో సేవలందించారని, శేష జీవితాన్ని ఆనందదాయకంగా గడపాలని కోరారు.కాగా ఉద్యోగ విరమణ పొందిన వారిలో ఇద్దరు డ్రైవర్లు, ఏడుగురు ఫిట్టర్ హెల్పర్లు, ఒక చైన్‌మెన్, పదహారు మంది మజ్దూర్లు, ఇద్దరు బోర్‌వెల్ అటెండర్లు, ఐదుగురు టర్నకాక్‌లు, ఒక పీహెచ్ మేస్త్రీ, ముప్పై రెండు మంది పీహెచ్ వర్కర్లు, నలుగురు మినిమం టైం స్కేలు ఉద్యోగులు ఉన్నారు. వారందరినీ దుశ్శాలువులతో సత్కరించి జ్ఞాపికలతో పాటు వారికి రావాల్సిన రూ. 8.50 కోట్ల పీఎఫ్ చెక్కులను అధికారులు అందించారు.

సిరిపురం : వీఎంఆర్‌డీఏలో సుమారు 35 ఏళ్ల నుంచి వివిధ హోదాల్లో సేవలందిస్తూ పదవీ విరమణ చేసిన పరిపాలనాధికారి ఎస్‌టీ లక్ష్మీనారాయణ, తహసీల్దార్ వీరభద్రరావు సేవలు మరవలేనివని ఉన్నతాధికారులు కొనియాడారు. వీఎంఆర్‌డీఏ భవన్‌లో ఉద్యోగులు వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కమిషనర్ రవీంద్ర, కార్యదర్శి దాట్ల కీర్తి, చీఫ్ అకౌంటెంట్ హరిప్రసాద్, చీఫ్ ఇంజనీర్ భవానీ శంకర్, పర్యవేక్షణ ఇంజనీర్ బలరామరాజు, ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, డీఎఫ్ఓ శ్యామల పాల్గొన్నారు.

నిత్యావసర సరకులు అందజేత

ఆరిలోవ, జూన్ 29 :రవీంద్రభారతి నగర్‌లో ఉంటున్న నిరుపేద బోని లక్ష్మి కుటుంబానికి సేవా స్ఫూర్తి సంస్థ సభ్యులు శనివారం నెలకు సరిపడ నిత్యావసర సరకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ అధ్యక్షుడు ఒమ్మి అప్పలరాజు, సభ్యులు ప్రకాశ్ పాత్రుడు, పద్మాజీ. నందు, తాతారావు, నానాజీ, ఎంవీ అప్పలరాజు పాల్గొన్నారు.

అతిసారపై అప్రమత్తం చేయాలి

ఆరిలోవ, జూన్ 29 : వర్షాకాలం నేపథ్యంలో జీవీఎంసీ అధికారులు నగరవాసులను అతిసార ప్రబలకుండా అప్రమత్తం చేయాలని భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ నాయకుడు జె. రవి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో వందలాది మంది అతిసార బారిన పడి చికిత్స పొందుతున్నారని, 50 మంది వరకు చనిపోయారని చెప్పారు.

విత్తనాలు పంపిణీ

పద్మనాభం, జూన్ 29 : మండలంలోని పలు గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు శనివారం వరి విత్తనాలు పంపిణీ చేశారు.మద్దిలో ఎంపీపీ రాంబాబు, రెడ్డిపల్లిలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దామోదరరావు రైతులకు విత్తనాలు అందజేశారు. కార్యక్రమాల్లో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు నగేష్ కుమార్, తెలుగు యువత అధ్యక్షుడు సత్యనారాయణ, ఏఈఓ శ్రీనివాసరావు, శ్రీరాములు, పీవీ రమణ, వీఏఏలు రమ్య, శివసాయి తదితరులు పాల్గొన్నారు.

రాయి చెట్టును తొలగించొద్దని పూజలు

సింహాచలం, జూన్ 29 : కొన్ని శతాబ్దాల చరిత్ర కలిగి కొన్ని తరాలకు నీడను, వందలాది పక్షులకు ఆశ్రయాన్ని కల్పిస్తున్న రాయి చెట్టును తొలగించొద్దని 98వ వార్డు పరిధిలోని పాత అడివివరం గ్రామస్తులు కోరుతున్నారు.బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ మార్గంలో పాత అడివివరం కూడలిలో ఉన్న రావి చెట్టును తొలగించేందుకు జీవీఎంసీ అధికారులు నిర్ణయించారు. ఈమేరకు శనివారం ఆ గ్రామస్తులు చెట్టు వద్దకు చేరుకుని ప్రత్యేక అభిషేకాలు చేసి అధికారుల నిర్ణయాన్ని ప్రతిఘటిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెట్టును రక్షించుకునేందుకు ఎంతటి పోరాటమైనా చేస్తామని స్పష్టం చేశారు.